దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

నందన్ ఎలక్ట్రానిక్స్
సెల్ నెం. 9949010118
డీలర్స్ ఇన్ : సెక్యూరిటీ సిస్టం, సీసీ కామెరాస్, బయోమెట్రిక్ అండ్ ఫైర్ సేఫ్టీ
UNICAM SYSTEMS
CP PLUS enhancing vision
Panasonic HIKVISION
Opp. Water Tank, Durga Nagar Junction, Mailrdevpally, Hyderabad-05

విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 221 | ది. 8-11-2025 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-
VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 221 | Date : 8-11-2025 | Saturday | Pages : 8 | Rs.1/-

# నవంబర్ 14 తర్వాత.. కేంద్రం జమిలి దిశగా అడుగులు....?



**న్యూఢిల్లీ ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిదశ పోలింగ్ ముగిసింది. రికార్డు స్థాయిలో 64.66 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 18 జిల్లాల్లోని 121 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేయడానికి తెల్లవారు జాము నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి నిల్చున్నారు. ఇక చివరిదైన రెండో విడత పోలింగ్ ఈ నెల 11వ జరుగనుంది. 14వ తేదీన ఓట్లను లెక్కిస్తారు.

**బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితం..** వన్ నేషన్ వన్ ఎలక్షన్ భవితవ్యాన్ని ఖరారు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎన్డీఏ గెలిస్తే.. ముందుగా అనుకున్నట్టే 2027లో జమిలి ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ దిశగానే కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోన్నట్లు తెలుస్తోంది. 2027 ఫిబ్రవరి నుంచి ఆరు నెలల్లో విడతల వారీగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జమిలి ఎన్నికలను నిర్వహించేలా కేంద్రం చర్యలు తీసుకుంటోన్నట్లు సమాచారం.అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి మధ్యంతర ఎన్నికలను నిర్వహించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. జమిలి ఎన్నికల బిల్లులో ఏవైనా సవరణలు ఉంటే ఈ జాయింట్ పార్లమెంటరీ కమిటీ సూచనలు, సలహాలను అందజేసింది. దానికి అనుగుణంగా ఇందులో మార్పులు చేర్పులు చోటు చేసుకోవచ్చు. ఇది అమలులోకి వస్తే 2027 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఒకేసారి అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు ఎన్నికలు జరిగే అవకాశాలు లేకపోలేదు. బీహార్ లో బీజేపీ, ఎన్డీఏ సంకీర్ణ కూటమి గెలుపు అవకాశాలు కష్టం అంటున్నారు అదే జరిగితే తప్ప జమిలి ఎన్నికలు వాయిదా పడే అవకాశం దాదాపుగా లేవు. ఎన్నికలను ఎప్పుడు నిర్వహించాలనేది కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందనే పాయింట్ వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులో స్పష్టంగా పొందుపరిచారు. ఎన్నికల వాతావరణం తమకు అనుకూలంగా లేకపోతే కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసుకుంటుందే తప్ప 2027లో జమిలి నిర్వహించాలని ఇదివరకే నిర్ణయం తీసుకుంది కూడా. సాధారణంగా ఆ ఏడాది ఫిబ్రవరి లేదా జూన్‌లో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉందంటూ గతంలో వార్తలు వెలువడ్డాయి. దేశంలో జమిలి ఎన్నికలు కొత్తేమీ కాదు. 1951 నుండి 1967 వరకు లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు ఒకేసారి జరిగాయి. 1951- 52లో తొలిసారిగా లోక్‌సభ, శాసనసభలకు మొదటిసారిగా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించారు. 1957, 1962, 1967 నాటి ఎన్నికల వరకూ అదే సంప్రదాయం కొనసాగింది. కొన్ని రాష్ట్రాల శాసనసభలు మధ్యంతర ఎన్నికలకు వెళ్లాల్సి రావడం వల్ల 1968- 69 మధ్యకాలంలో జమిలికి తొలిసారిగా బ్రేక్ పడింది. 1970 నాటి లోక్‌సభ కూడా ముందస్తుగా రద్దయింది. ఆ తరువాత 1971లో లోక్‌సభకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి జమిలి మళ్లీ పునరుద్ధరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

# రాష్ట్రంలో క్లస్టర్ వారీ విధానంలో పారిశ్రామికాభివృద్ధి

- మూడు మెగా సిటీలు, 15 ఇండస్ట్రియల్ జోన్ల అభివృద్ధి
- పెట్టుబడుల సదస్సు కంటే ముందే వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు
- 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ. 1,01,899 కోట్లు పెట్టుబడులకు, 85870 ఉద్యోగాలకు ఎస్ఐబీపీలో ఆమోదం
- 16 నెలలుగా ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ. 8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05870 ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్



**అమరావతి,నవంబర్ 7 (వార్తాప్రభ) :** పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు...అవి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పరిశ్రమల కోసం అవసరమైన భూములు..విద్యుత్ లభ్యత కూడా ఉండేలా చూడాలని సీఎం సూచించారు. శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఎస్ఐపీబీ ఆమోదించింది. వీటి ద్వారా రూ. 1,01,899 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 85,570 ఉద్యోగాలు దక్కనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన 16 నెలల్లో జరిగిన 12 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తంగా రూ. 8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధా కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి. క్షేత్ర స్థాయిలో ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన వచ్చేలా శ్రద్ధ పెట్టాలి. గత పాలకులు భూమి కేటాయించినా ఇప్పటికీ ప్రారంభం కాని ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో సమీక్షించాలి. ఏ ప్రాజెక్టులైనా నిర్మాణ పురోగతి లేకపోతే అనుమతులు రద్దు చేయాలి. ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలి. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. చిప్, సెమీ కండక్టర్లు, డ్రోన్ వంటి పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో సుమారు 15 పారిశ్రామిక జోన్లను ఏర్పాటు చేసుకుని... క్లస్టర్ వారీ విధానంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు ఇస్తుంది. ఇలాంటి వాటిని గుర్తించి ప్రమోట్ చేయాలి. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు కొంచెం ఆలస్యమైనా... రాష్ట్ర ప్రభుత్వం వైపు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పెట్టుబడులు చేజారకుండా చూడాలి. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలపై సంప్రదింపులు జరుపుదాం. పారిశ్రామిక అవసరాల నిమిత్తం... పరిశ్రమలకు విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రంతో కలిసి పని చేసే అంశాన్ని పరిశీలించాలి. ఇక ప్రభుత్వం కూడా పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసుకోవాలి. అలాగే ఎవరైనా ప్రైవేట్ ల్యాండ్ ఓనర్లు తమ భూములను పరిశ్రమలకు, కంపెనీలకు ఇవ్వడానికి ముందుకు వస్తే.. అలాంటి వారిని ప్రోత్సహించాలి."అని ముఖ్యమంత్రి అన్నారు

**మెగా సిటీలు... మాస్టర్ ప్లాన్లు..** "రాష్ట్రంలో మూడు మెగా సిటీలు అభివృద్ధి చేయాలి. అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను మెగా సిటీగా అభివృద్ధి చేయాలి. అలాగే తిరుపతి, అమరావతి నగరాలను కూడా మెగా సిటీలు చేయాలి. ఇప్పటికే అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతి మెగా సిటీలకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చూడాలి. ఈ మేరకు టూరిజం, ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలు సమన్వయం చేసుకుని ఈ మెగా సిటీలు అభివృద్ధి జరిగేలా చూడాలి. అలాగే వీటికి టౌన్ షిప్స్ ఇంటిగ్రేషన్ జరగాలి, నివాసయోగ్యమైన నగరాలుగా తీర్చిదిద్దాలి. గూగుల్ డేటా సెంటర్ వల్ల విశాఖకు మరిన్ని కంపెనీలు, పరిశ్రమలు రానున్నాయి. భవిష్యత్తులో విశాఖకు వచ్చే కంపెనీలకు భూ లభ్యత ఉండేలా చూసుకోవాలి. టూరిజం అభివృద్ధికి ఆతిధ్య రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రముఖ బ్రాండ్ లకు చెందిన హొటళ్లు నిర్మించేలా చూడాలి. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు అవుతున్నాయి. దీనికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు మూడు కారిడార్లకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తాం. బీచ్ టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి."అని సీఎం చెప్పారు.

**పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించాలి..** ఈ నెల, 14,15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమల్లో వేగంగా శంకుస్థాపనలు జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. తనతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు ఆయా జిల్లాల్లో పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక ఇటీవల తాను జరిపిన విదేశీ పర్యటనల్లో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించానని.. విశాఖలో జరగబోయే పెట్టుబడుల సదస్సుకు భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

# ప్రజల చేతిలో పల్లె రహదారుల సమాచారం

- త్వరలో అందుబాటులోకి 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం'
- పైలెట్ ప్రాజెక్టుగా అడవి తల్లి బాటకు అనుసంధానం
- సాస్కీ నిధులతో పల్లె పండగ 2.0
- క్షేత్ర స్థాయి పర్యటనలతో జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పనుల పరిశీలన
- స్వచ్ఛ జలం.. గుంతలు లేని రోడ్ల నిర్మాణానికి ప్రధమ ప్రాధాన్యం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విజయవాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** పల్లె ప్రజలకు నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలన్నదే తన ముందున్న ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. తన ప్రతి అడుగూ ఆ దిశగానే ఉంటాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్, పల్లె పండగ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని స్పష్టం చేశారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో త్వరలో సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించబోతున్నట్టు తెలిపారు. 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం' ద్వారా గ్రామీణ రోడ్ల పూర్తి సమాచారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. సాస్కీ నిధుల సాయంతో పల్లె పండగ 2.0ని ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పల్లె పండగ 2.0, అడవి తల్లి బాట పనుల పురోగతి, జల్ జీవన్ మిషన్, స్వమిత్ర పథకాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిధులు అం దుబాటులో ఉన్నా పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అడవి తల్లిబాట, జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా తక్షణం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి పనిని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేలా ఈ ప్రణాళి కలు ఉండాలన్నారు. ఈ మేరకు యంత్రా ంగానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భం గా సాస్కి నిధులకు అనుమతుల స్టేటస్ గురించి పంచాయ తీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ అధికారు లను ఉప ముఖ్యమ ంత్రివర్యులు ప్రశ్నిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూత్రప్రాయంగా ఆమోదించారని, ఆర్థిక శాఖ నుంచి సమ్మతి రావాల్సి ఉందన్నారు. ఈ అంశంపై తక్షణం ఆర్థిక శాఖతో చర్చించాలని అధికారులను ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ రహదారులన్నింటినీ జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టంకు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలి. మనం ప్రయాణం చేసే మార్గంలో రోడ్డు ఉందా? లేదా? ఉంటే ఎలా ఉంది? అనే వివరాలు ప్రజల చేతిలో అందుబాటులో ఉండే వ్యవస్థను తీసుకురావాలి. అసలు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని రహదారులు ఉన్నాయి? అవి ఎలా ఉన్నాయి? అనే వివరాలు కూడా ప్రతి ఒక్కరికీ తెలియాలన్నారు. కొత్త రహదారి నిర్మిస్తే అందుకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటలోకి రావాలి. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని, రహదారులను మెరుగుపరచుకునేలా ఈ సాంకేతికత ఉండాలి. ఈ విధంగా జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టంను త్వరితగతిన అభివృద్ధి చేయండి. అధునాతన సాంకేతికత సాయంతో ఆ విధమైన వ్యవస్థకు రూపకల్పన చేయండి. 48 గంటల్లో అందుకు సంబంధించి ఒక స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం కావాలి. ఒక వర్కింగ్ గ్రూప్ రూపొందించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందులో పొందు పరచాలి. ఈ అంశంలో ఆర్టీజీఎస్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి. అడవి తల్లి బాటను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంచుకుని ఈ సిస్టంకు అనుసంధానించండి. తద్వారా ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో పనుల పరోగతిని పరిశీలించే అవకాశం కలుగుతుంది. ఏ పని చేసినా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి అన్నదే మా ఉద్దేశం అని పేర్కొన్నారు.

**అడవి తల్లిబాట పట్ల అలసత్వం వద్దు..** గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లిబాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనబడడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పక్కా ప్రణాళికతో అన్నింటినీ అధిగమించాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతోపాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సాయం మొత్తం కలిపి రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించాం. ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోండి. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఏదైనా సమస్య ఉంటే దాన్ని తక్షణం పరిష్కరించి పనులు ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# జూబ్లీహిల్స్ లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే...

- ప్రతిపక్షాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు...
- నగరాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యంబీ మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జూబ్లీహిల్స్ లోఎగిరేది కాంగ్రెస్ జెండానే అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో ఓటర్లు బీజేపీ, బీఆర్ఎస్ కు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను అప్యాయంగా పలుకరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ హైదరాబాద్ మహా నగరాభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. కొన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను చూపించి నగరాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. నగరాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం మాపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు అవకాశమి చ్చిన తెలంగాణ ప్రజల ఆశలు, భావితరాల ఆకాంక్షలే అజెండాగా అత్యంత పారదర్శకతతో కూడిన పాలనను తమ ప్రభుత్వం అంది స్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి నిరంతరం పాటు పడుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. ప్రతి పక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి, నిరంతరం నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం తపించే నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా క్రికెటర్ శ్రీ చరణికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహకం

- రూ.2.5 కోట్ల నగదు నజరానా
- ఇంటి నిర్మాణం కోసం 1000 చ.గ. స్థలం
- గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని సీఎం నిర్ణయం
- మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన శ్రీచరణి
- మహిళా క్రికెటర్ కు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్



**అమరావతి,నవంబర్ 7 (వార్తాప్రభ) :** మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీ చరణికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం లో గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీ చరణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీ చరణి పంచుకున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీ చరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్ ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ చరణితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తుంది

**-ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేస్తాము - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి**

**ముసునూరు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ముసునూరు మండలం, కొర్లగుంట గ్రామ కోఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి నూజివీడు నియోజకవర్గంలోని తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు నష్టపోకుండా, ప్రభుత్వ నిర్ధేశిత కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంటను అమ్మవద్దని సూచించారు. దళారులు, మధ్యవర్తులు లేదా మిల్లర్ల చేత రైతులు మోసపోకూడదని స్పష్టం చేశారు. ఈ-పంట నమోదు చేసుకొని, ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతుల వద్ద నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు ధాన్యం అమ్మడానికి పడుతున్న కష్టాలు తొలగాయని మంత్రి గారు తెలిపారు. గతంలో రైతులు సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు ధాన్యం తరలించాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రతి పంటకోత ప్రాంతంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.



# ప్రభుత్వ వైద్య కళాశాలలను లాభాపేక్ష వర్గాల చేతుల్లో పెట్టడం దుర్మార్గం-మందా జక్రి

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జక్రి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ
- చంద్రగూడెం, గణపవరం, వెల్వడం గ్రామాలలో కోటి సంతకాల సేకరణకు ప్రజాధారణ





**మైలవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ప్రభుత్వ వైద్య కళాశాలలను లాభాపేక్ష వర్గాల చేతుల్లో పెట్టడం అత్యంత దుర్మార్గమని కోటి సంతకాల సేకరణ నియోజక వర్గ ఇంచార్జ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.కొండూరు జెడ్పిటిసి సభ్యులు మందా జ క్రధరరావు (జక్రి) పేర్కొన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనలు,మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు మైలవరం మండలంలోని చంద్రగూడెం గణపవరం వెల్వడం గ్రామాలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మందా జక్రధరరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగింది.ఈ సందర్భంగా జక్రధరరావు మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల ఆదరణ లభిస్తోందని అన్నారు.మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో వైద్యవిద్య హక్కు అనేది అందరికీ సమానంగా లభించాలని స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి,మైలవరం నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు పసుపులేటి రమేష్,మైలవరం మండల పార్టీ అధ్యక్షులు గర్నెపూడి వెంకట్రావు,వెల్వడం గ్రామ సర్పంచ్ పి.ధర్మరాజు, వైసీపీ సీనియర్ నాయకులు తోట తిరుపతిరావు, జనార్దన్ రెడ్డి, యరమల నరసింహారెడ్డి,కృష్ణారెడ్డి, బ్రహ్మ రెడ్డి నాగేశ్వరరావు, జమలయ్య, గణపవరం వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సీతారావమ్మ, వజ్రాల సీతారెడ్డి,చంద్రగూడెం సర్పంచ్ బొలగాని శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వెంకటేశ్వరరావు,పద్మావతి,గ్రామ పార్టీ అధ్యక్షు లు శీలం బుజ్జి, పార్టీ నాయకులు శ్యామ్. శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీ సాయి అన్నసమారాధన కు 10 వేలు విరాళం



**పెడన,నవంబర్ 7 (వార్తాప్రభ) :** కొండిపాలెం గ్రామంలో వున్న షిరిడి సాయి మందిరం వద్ద ప్రతినెలా మొదటి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి పెడన వాస్తవ్యులు పామర్తి శ్రీనివాసరావు రమాదేవి కుటుంబ సభ్యులు 10 వేల రూపాయలను విరాళంగా అందించారు. ఈ దంపతులతో పాటు వారి కుమారులు జితేంద్ర భాగ్య శ్రీ దంపతులు చిన్న కుమారుడు జగదీశ్ ఈ నగదు ను ఫిక్స్ డిపాజిట్ రూపంలో అన్నదాన కార్యక్రమం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి దాయక గీతం వందేమాతరం



**పెడన,నవంబర్ 7 (వార్తాప్రభ) :** పెడన పట్టణంలోని తోటమూల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బంకిం చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతాన్ని రచించి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా గీతాలాపన కార్యక్రమంలో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిదాయక గీతం... ఉద్యమానికి ధైర్యాన్నిచ్చిన ధ్వని తరంగం... వందే మాతరం గీతాన్ని బంకిం చంద్ర ఛటర్జీ నవంబర్ 7- 1875న స్వరపరిచారు. వందేమాతరం అంటే మాతృభూమిని వందనం చేయుట అని అర్థం.వందే మాతరం స్వరంతోనే అనేక మంది యువకులు స్వతంత్ర ఉద్యమంలో భాగమయ్యారు ఈ 150 వసంతాలు సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం వలన మన దేశ భక్తిని సాంస్కృతిక ఐక్యతను గుర్తుచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కమ్మగంటి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## వందేమాతరం - జాతిని జాగృతం చేసిన గీతం

– ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** భారత స్వాతంత్ర్య సమరంలో దేశ ప్రజల్లో జాతి చైతన్యాన్ని, దేశభక్తిని నింపిన గీతం వందేమాతరం అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. కాకినాడ సాలిపేట గర్ల్స్ హై స్కూల్ లో వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మంది విద్యార్థినిలు సమూహగానం ద్వారా వందేమాతరం ఆలపించగా, ఆ దృశ్యం దేశభక్తి జ్వాలలను రగిలించింది. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ వందేమాతరం ఉద్యమ స్ఫూర్తితో ఏడాది పాటు వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం దేశవ్యాప్తంగా కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు స్వాతంత్ర్య యోధులకు ప్రేరణగా నిలిచింది. ఈ గీతం దేశమంతటా రణ నినాదంలా మారి, స్వతంత్ర సమరయోధులకు మనోబలం ఇచ్చింది" అని తెలిపారు.జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ, "బ్రిటిష్ పాలకులకు 'వందేమాతరం' అనే మాటే భయపెట్టేది. ఆ గీతం భారతీయుల నోట మంత్రంలా మారింది. దానిని పలికిన వారిని జైళ్లలో వేయడం జరిగింది" అని గుర్తుచేశారు.వందేమాతరం గేయంలో ఉన్న శక్తి, ఆత్మవిశ్వాసం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ప్రేరణగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్,కాకినాడ సిటీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఉపవిద్యాశాఖాధికారి కె.వి.వి. సత్యనారాయణ, మండల విద్యాశాఖాధికారి-1 తాడి గణపతి సుబ్బారావు ప్రధానోపాధ్యాయురాలు విశాలాక్షి, కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు,ఆలయ కమిటీ చైర్మన్ చిట్టిబాబు,గంగరాజు, బరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు (నవంబర్ 8న) రామచంద్రపురంలో ఉద్యోగమేళా



**రామచంద్రపురం,నవంబర్ 7 (వార్తాప్రభ) :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వారం వారం నిర్వహించే జాబ్ మేళాలో భాగంగా నేడు అనగా నవంబర్ 8న శనివారం ఉదయం 9 గంటలకు రామచంద్రపురంలోని ఉపాధి భవన్లో జాబ్ మేళా జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్ మేళాలో టీవీ సెటప్ బాక్స్, ఎలక్ట్రికల్ కార్స్, బ్యాటరీస్, ఇయర్ బర్డ్స్, ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్, సోలార్ తదితర పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు. రేడియంట్ అప్లైయన్స్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రీమియర్ ఎనర్జీస్, రినేవ్ సిన్ ఇండియన్, భగవతి ప్రొడక్ట్స్ లిమిటెడ్ మైక్రోమ్యాక్స్, ఫోక్సో ఖాన్, ఎగ్జిమో ఎనర్జీ, సఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇండియా తదితర కంపెనీలో పనిచేయుటకు స్త్రీ,పురుష అభ్యర్థులు 10th , ఇంటర్ , ఐటిఐ, డిప్లొమా, బీటెక్ చదివిన 18 నుండి 27 సంవత్సరాలు అభ్యర్థులకు హైదరాబాదులోని వివిధ కంపెనీల్లో పనిచేయుటకు రూ.15 వేలు నుండి 21 వేలు జీతముతో ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ - ఎస్ రాంబాబు



**విస్సన్నపేట,నవంబర్ 7 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పదవ తరగతి పరీక్షలకు సంబంధించి నిర్వహణకు సిద్ధంగా ఉన్న పరీక్షా కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ఎస్ రాంబాబు ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు వ్రాసేందుకు బల్లలు వెంటిలేషన్ ఇతర సౌకర్యాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, విస్సన్నపేట హైస్కూల్ పరిశీలన సమయంలో హెచ్ఎం రంగా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరం పై పోలీసుల దాడి

- 9 మంది జూదరులు అరెస్ట్.
- 49 ద్విచక్ర వాహనాలు,రూ.1,15,600 లు సీజ్




**మైలవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం లోని పోరాటనగర్ శివారు ఫారెస్ట్ ఏరియాలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మైలవరం ఎస్ఐ సుధాకర్ ట్రైని ఎస్ఐ రవి వర్మ, సిబ్బంది తో కలిసి ఈ నెల 6వ తేదీ గురువారం మధ్యాహ్నం మెరుపు దాడి చేశారు.ఈ దాడిలో 9 మంది జూదారులను అరెస్ట్ చేశారు.అరెస్ట్ చేసిన జూదరుల నుంచి రూ.1,15,600 లు స్వాధీనం చేసుకోవడంతో పాటు పేకాట శిబిరం వద్ద ఉన్న 49 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. పట్టుబడిన జూదరులను కోర్ట్ లో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## భారతీయులలో ఐక్యమత్యానికి పిలుపుగా "వందమాతరం" శత సం. రాల పండుగ

–ప్రముఖ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పి.ఎల్.పి.యాదవ్




**మార్కాపురం, నవంబర్ 7 (వార్తాప్రభ) :** కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు ఈ రోజు ఉదయం 11 గంటలకు మార్కాపురం గడియారం స్తంభం గాంధీ పార్కులో గాంధీ గారి విగ్రహానికి పూలమాల వేసి ప్రముఖ సామాజికవేత్త గోపాలుని హరిహరరావు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అందరూ కూడా వివిధ కార్యాలయాలు వ్యాపార సంస్థలు పట్టణాల కూడలలో ఈరోజు ఉదయం 10 గంటల నుంచి మూకుమడిగా వందేమాతరం గీతాలాపన చేస్తున్నారని అందులో భాగంగా మార్కాపురం పట్టణంలోని గాంధీ పార్క్ లో వందేమాతరం గీతాన్ని భారత స్కౌట్స్ విద్యార్థుల తో కలిసి ఆలపించడం జరిగిందన్నారు. ప్రముఖ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పి ఎల్ పి యాదవ్ మాట్లాడుతూ భారతీయులందరూ సుహృద్భావ వాతావరణంలోజీవిస్తున్నటువంటి పరిస్థితుల్లో ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం ఐకమత్యానికి నిదర్శనమని అన్నారు.హిందూ ముస్లిం క్రైస్తవ సోదరులు అందరూ కలిసి నిర్వహించినటువంటి ఈ కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకమని యాదవ్ తెలియజేశారు.శ్రీశైలం మల్లన్న దేవస్థానం మాజీ ధర్మకర్త డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ వందేమాతరం స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. రంగస్వామి, ఆర్మీ సాయి, నరసింహ, కేశవ వీరారావు నాగార్జున పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



**కాకినాడ రూరల్ /నడకుదురు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా కరప మండలం నడకుదురు గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.జె.నరసింహ నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ముందుగా స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా, తదుపరి అవసరం అయితే చిన్న పరీక్ష ద్వారా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే -డ్రైడే కార్యక్రమంలో పాల్గొని స్థానిక పంచాయతీ సిబ్బంది ద్వారా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్. కెవి.సుబ్బరాజు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్. ఐ.ప్రభాకర్, జిల్లా ఎన్ సిడి నోడల్ అధికారి డాక్టర్ .వి. అరుణ, కరప పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్. ఎంజాలిన్, సిబ్బంది పాల్గొన్నారు

## పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించిన కమిషనర్ సుధాకర్



**కాకినాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ కెటి సుధాకర్ శుక్రవారం ఉదయం ప్రత్యక్షంగా పరిశీలించారు. శానిటేషన్ సర్కిల్-14లోని కరణం గారి సెంటర్ మస్తరు కేంద్రం వద్ద ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల హాజరు పట్టికను పరిశీలించి, విధులకు హాజరుకాని పారిశుధ్య కార్మికుల వివరాలను శానిటేషన్ ఇన్స్పెక్టర్ దుర్గారావు నుంచి అడిగి తెలుసుకున్నారు. తర్వాత కమిషనర్ సుధాకర్ భానుగుడి సెంటర్, టూ టౌన్, చిన్న మార్కెట్, గాంధీనగర్ ప్రాంతాలను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను సమీక్షించారు. అలాగే గాంధీనగర్ పబ్లిక్ కులాయి ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటి నాణ్యతను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత అని. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా, తడి చెత్త%-%పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే అందించాలి," అని సూచించారు. శానిటేషన్ నిర్వహణలో సమర్థత పెంచేందుకు ఇన్స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. వివేకానంద పార్కు వద్ద గల అన్న క్యాంటీన్ ను కూడా ఆయన సందర్శించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిఇ లక్ష్మీనారాయణ, సానిటరీ ఇన్స్పెక్టర్లు దుర్గారావు, సత్తిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది కి ప్రొక్యూర్మెంట్ శిక్షణ



**జి.కొండూరు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (PACS)లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది గా ఉన్న పిఏసిఎస్ సెక్రటరీస్ కి, టెక్నికల్ అసిస్టెంట్స్ కి,డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మరియు కస్టోడియన్ ఆఫీసర్స్ గా ఉన్న వీఆర్వో లకు మరియు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శుక్రవారం స్థానిక పీ ఏ సీ ఎస్ కార్యాలయం నందు మండల స్థాయిలో ప్రొక్యూర్మెంట్ ట్రైనింగ్ నిర్వహించడం జరిగినది.ఈ శిక్షణా కార్యక్రమాని కి స్థానిక తహశీల్దార్ సి హెచ్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి కె.సిహెచ్.సూరి బాబు,టెక్నికల్ అసిస్టెంట్ (డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీస్) రవికుమార్ హాజరై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

## డిసెంబర్ 4 నుంచి శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు



**పెడన,నవంబర్ 7 (వార్తాప్రభ) :** జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు డిసెంబర్ నెల 4 నుంచి ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సంబరాలు డిసెంబర్ నెల 14 తో ముగుస్తాయి. శిడిబండ్లు ప్రత్యేక ప్రభల ఊరేగింపులు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందరరావు, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు తెలిపారు.ప్రాంగణంలో ఏర్పాటు చేయు వ్యాపార దుకాణాలకు నవంబర్ 15వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల పాటదారులు ఈ వేలంపాటలో పాల్గొని తమ దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## యల్.బి.ఆర్.సి.ఈ లో వందేమాతర గీతాలాపన



**మైలవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ మరియు యన్ .సి.సి వారి ఆధ్వర్యంలో జాతీయ గీతం "వందేమాతరం" నేటితో 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు గురువారం జాతీయ గేయాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు మాట్లాడుతూ 1875లో బంకించంద్ర ఛటర్జీ స్వరపరిచిన మన జాతీయ గీతం "వందేమాతరం" 2025 నాటికి 150వ వార్షికోత్సవం అవుతుందని తెలియజేశా రు.ఇది భారతదేశ సాంస్కృతిక వారసత్వం మరియు దేశభక్తి స్ఫూర్తికి కారణం అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.బి.రమేష్ రెడ్డి , వివిధ విభాగాధిపతులు, యన్.సి.సి కోఆర్డినేటర్ ఆర్.పవిత్ర, అసిస్టెంట్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శీలం ఉమా మహేశ్వర రెడ్డి , అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర స్ఫూర్తి "వందేమాతరం"గేయం

–గ్రంథాలయాధికారిణి రమాదేవి



**విజయవాడ, నవంబర్ 7 (వార్తాప్రభ) :** ఠాగూర్ గ్రంథాలయం నందు 150 సంవత్సరాల జాతీయగీతం వందేమాతరం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా. గ్రంథాలయ అధికారిని కే రమాదేవి ముందుగా "స్వాతంత్ర స్ఫూర్తి" వందేమాతరం గేయ రచయిత బంకించద్ చటర్జీ పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులందరూ కలిసి సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించటం జరిగినది. ఈ కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయం సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయ డైరీకి సుదీర్ఘకాలం సేవలు అందించిన, మాజీ చైర్మన్ మండవ జానకి రామయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు
–గన్నవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :

# జగద్గిరిగుట్ట హత్య ఘటనపై అఖిలపక్ష నాయకుల ఖండన..



**జగద్గిరిగుట్ట, నవంబర్ 7, (వార్తాప్రభ) :** జగద్గిరిగుట్ట లో బుధవారం జరిగిన హత్య ఘటన చాలా దారుణమైనది. ఈ సంఘటనతో సభ్య సమాజం తీవ్రంగా కలచివేసింది. ప్రజల్లో భయం, ఆందోళన నెలకొంది. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో మరల పునరావృతం కాకుండా చూడడం అందరి బాధ్యత అని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలోని ప్రతి ఒక్కరూ శాంతి, భద్రత, సామాజిక సమైక్యత కాపాడే దిశగా కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద ఘటనను తీవ్రంగా ఖండించి, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ అప్పారావు గారికి మెమోరాండం అందజేశారు. పోలీస్ అధికారులు కూడా ప్రజలతో కలసి సమన్వయంతో పనిచేసి ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. జగద్గిరిగుట్ట అనేది "మినీ తెలంగాణ"గా ప్రసిద్ధి చెందింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి, దేశంలోని ఇతర రాష్ట్రాలనుంచి వలసవచ్చిన కార్మికులు ఇక్కడ నివసిస్తున్నారు. ఈ ప్రాంతం భిన్న సంస్కృతులు, భిన్న ప్రాంతాల ప్రజలతో కలిసిమెలిసి జీవించే సమైక్యతకు ప్రతీకగా ఉంది. అయితే ఇటీవలి కాలంలో, ముఖ్యంగా గంజాయి వ్యసనం కారణంగా ఇక్కడ హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏడాది ఎక్కడో ఒకచోట ఇలాంటి హత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి పరిణామాలు జగద్గిరిగుట్టకు చెడ్డ పేరు తెస్తున్నాయని, దీని వల్ల కొత్తగా వలస వచ్చి స్థిరపడదలచిన కుటుంబాలు ఇక్కడకు రావడానికి వెనుకంజ వేయవచ్చని, తద్వారా స్థానిక ప్రజలకు భవిష్యత్తులో అభివృద్ధి అవకాశాలు తగ్గిపోతాయని నాయకులు పేర్కొన్నారు. కావున, ఇలాంటి దారుణ సంఘటనలు మళ్లీ జరగకుండా అందరూ రాజకీయ భేదాలు పక్కనపెట్టి ఒకటిగా ముందుకు రావాలని, ప్రతి బస్తీలో బస్తీ పెద్దలు, యువకులు కలిసి గంజాయి, మత్తు పదార్థాలు మరియు హింసాత్మక కార్యకలాపాలను అరికట్టే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## రుద్ర హోమం, చండీ హోమ కార్యక్రమంలో పాల్గొన్న కె.యం. ప్రతాప్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి మాణిక్య నగర్ శ్రీ కామాక్షి సమేత ఏకాంబ్రనాధ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మాణిక్య నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు గురువారం నిర్వహిస్తున్నటువంటి రుద్ర హోమం చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలకు రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ, ఆలయ పునర్ నిర్మాణం చాలా చక్కగా జరిగిందన్నారు, దేవాలయ పుణ నవగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా, యజ్ఞ, యాగాలు, మహా కుంభాభిషేకాలు నిర్వహిస్తూ, మాణిక్య నగర్ బస్తీవాసులనే గాక, చుట్టు ప్రక్కల కాలనీ, బస్తి వాసులను కలుపుకొని పోతూ, ఆధ్యాత్మికను పెంపొందిస్తున్న మాణిక్య నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాణిక్య నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు రాజేష్, ఖలీల్, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్,నాగరాజ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, మధు, జయేందర్ రెడ్డి, ఆలయ కమిటీ: సురేష్, రఘునాథరెడ్డి, గోపాల్ రెడ్డి, సలహాదారులు ఇంద్రసేనారెడ్డి, రామేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, భీమప్ప, కాలనీ సీనియర్ సిటిజన్లు: పోచయ్య, కేవీఆర్ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరంగం శ్రీనివాస చార్యులు, మాణిక్య నగర్ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వే డీ జీ ఎం ఉదయనాథ్ ను కలిసిన అసోసియేషన్ సభ్యులు



**హైదరాబాద్ : నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సబర్బన్ రైలు మరియు బస్సు ట్రావెలర్స్ అసోసియేషన్ సభ్యులు నూర్ (జెడ్ ఆర్ యు సి సి సభ్యుడు) భరద్వాజ్ (డి అర్ యు సి సి సభ్యుడు) దక్షిణ మధ్య రైల్వే డీ జీ ఎం (జి) ఉదయనాథ్ కోట్లను కలిసి వివిధ అభ్యర్థనలకు సంబంధించిన వినతి పత్రం సమర్పించారు. మల్కాజిగిరి వద్ద అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపడం, మేడ్చల్ / మల్కాజిగిరి నుండి కర్నూలు వరకు తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ నడపడం, జక్లెర్ రాయచూర్ మంత్రాలయం మీదుగా గుంతకల్ వరకు 12861/62 విశాఖపట్నం మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు, చర్లపల్లి నుండి మల్కాజ్‌గిరి మీదుగా లింగంపల్లి సికింద్రాబాద్ ఉమ్దానగర్ వరకు ఎం ఎం టి ఎస్ సేవలను నడపాలని అభ్యర్థించారు.

# అనురాగ్ లో వందేమాతరం 150 వ వార్షిక వేడుక





**కాప్రా, నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మన జాతీయ గీతం అయిన వందేమాతర గీతం 150 సంవత్సరాలు అయిన సందర్భముగా, శుక్రవారం ఉదయం 10:00 గంటలకు ఐకానిక్ వందేమాతరం గీతాన్ని అనురాగ్ మానసికదివ్యాంగులు, తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కలిసి అనురాగ్ ప్రత్యేక పాఠశాలలో సామూహికంగా పాడి, జాతీయ ఐక్యత ను మరియు దేశభక్తిని తెలిపారు. దేశ వ్యాప్తముగా ఒకే సమయంలో మన జాతీయ గీతం అయిన "వందేమాతరం" ను పాడటం మన గొప్ప సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం మరియు ఇది మనకు దేశం పట్ల ప్రేమను మరియు మన ఐక్యతను ప్రదర్శిస్తుందని డా. రామ్ తెలిపారు. అనంతరం అందరికి ఈ సందర్భముగా స్నాక్స్ ను పంచిపెట్టారు.

# ఎన్టీపీసీ సెకండ్ సన్ ఆఫ్ ఇండియా!!

● విజయాల అనుభవంతో భవిష్యత్తు లక్ష్యాలను చేరుకుంటాం ● ఎన్టీపీసీలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ● సామాజిక బాధ్యతతో సేవలను మరింత విస్తరిస్తాం ● నాణ్యమైన విద్యుత్తును బాధ్యతాయుతంగా అందిస్తాం ● పచ్చని రేపటికి శక్తినివ్వడం 51 సంవత్సరాల పురోగతి ● ఎన్టీపీసీ ఈడి చందన్ కుమార్ సమంత







**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి)** ఎన్టీపీసీ సెకండ్ సన్(సూర్యుడు) ఆఫ్ ఇండియా అని, సంస్థ విజయాల అనుభవంతో భవిష్యత్తు లక్ష్యాలను చేరుకుంటాం అని ఎన్టీపీసీ ఈడి చందన్ కుమార్ సమంత సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు పర్మినెంట్ టౌన్ షిప్ లోని కాకతీయ కళాభవన్లో శుక్రవారం ఎన్టీపీసీ 51 వసంతాల వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈడి చందన్ కుమార్ సమంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వీరు ఇరువురు మాట్లాడుతూ..... సామాజిక బాధ్యతతో సిఎస్ఆర్ సేవలను మరింత విస్తరిస్తాం అని తెలిపారు. నాణ్యమైన విద్యుత్తును బాధ్యతాయుతంగా దేశానికి అందిస్తాం అని అన్నారు. పచ్చని రేపటికి శక్తినివ్వడం ఎన్టీపీసీ సంస్థ యొక్క 51 సంవత్సరాల పురోగతి అని తెలిపారు. సంస్థాగత వృద్ధి, విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ ఉద్యోగుల, కార్మికుల సహకారాన్ని గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పత్తిలో సంస్థ సాధించిన పురోగతిని, ఆవిష్కరణలను ప్రస్తావించారు.

# పోచమ్మని కొట్టినోడు కొసెల్లడు!!

● మూర్ఖుంతా మట్టి కొట్టుకుపోతారు ● హిందూ మనోభావాలు దెబ్బతీసినోళ్లు భస్మం అయితారు ● రామగుండంలో ఔరంగజేబు పాలన సాగుతోంది ● ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి ● రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి





**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి)** పోచమ్మని కొట్టినోడు కొసెల్లడు అని గ్రామదేవతలు అయిన మైసమ్మ, వేలుపమ్మ, పోచమ్మ గుళ్ళు కూల్చివేసిన నేపథ్యంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సంఘటనకు సంబంధించిన కారకులను తీవ్ర స్థాయిలో శపించారు రామగుండం బిజెపి మహిళా నేత కందుల సంధ్యారాణి. ఈ మేరకు శుక్రవారం గోదావరిఖని పోచమ్మ దేవాలయం వద్ద విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్, ఆర్ఎస్ఎస్ ఇచ్చిన పిలుపుమేర స్పందించిన పలు పార్టీల అలాగే వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, హిందూ బంధువులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కందుల సంధ్యారాణి మీడియాతో మాట్లాడారు. గ్రామదేవతల గుళ్లను కూల్చిన మూరు?లంతా మట్టి కొట్టుకుపోతారు అని అన్నారు. హిందూ మనోభావాలు దెబ్బతీసినోళ్లు భస్మం అయితారు అని తెలిపారు. రామగుండంలో ఔరంగజేబు పాలన సాగుతుందని తీవ్ర ఆరోపణలు చేశారు. సంఘటనకు ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. తదనంతరం గోదావరిఖని రాజీవ్ రహదారిపై కూర్చుని రాస్తారోకో చేపట్టారు. నినాదాలు చేశారు.వందల సంఖ్యలో వాహనాలను నిలిపివేశారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో, రాజీవ్ రహదారిపై కాసేపు గందరగోళ వాతావరణం నెలకొన్నది. ఏది ఏమైనా గ్రామదేవతల గుళ్లను కూల్చడం పిచ్చి తుగ్లక్ పని అని మెజారిటీ ప్రజలు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు, కార్యకర్తలు, హిందూ బంధువులు తమ తమ స్టైల్లో శపించడం కొస మెరుపు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి

***జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత***



**జగిత్యాల, నవంబర్ 07(వార్తాప్రభ): :** వరి ధాన్యంకొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సూచించారు. జిల్లాలోని మల్యాల మండలం రామన్నపేట తోపాటు పోతారం, రాజారం గ్రామాల్లో ప్యాడి సెంటర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ బి.ఎస్ లత పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు తేమయంత్రాలు ప్యాడి క్లీనర్స్ టార్పలెన్లు సరిపోయినన్ని అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు.వరి ధాన్యం కేంద్రంలో నిర్వాహకులు వివరాలు మద్దతు ధర టోల్ ఫ్రీ నెంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.రైతులు వారి ధాన్యము కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి పంట రుసుము సకాలంలో రైతులు ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు అన్ని రకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు.రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పంటకు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2389 బి గ్రేడ్ రకానికి 2369 కల్పిస్తుందని రైతులు వరి ధాన్యము ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఇవ్వాలని తెలిపారు.ధాన్యాన్ని శుభ్రపరిచి తగిన తేమ శాతం కలిగిన తర్వాత మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు.వరి కొనుగోలు ప్రక్రియలు రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్ 18004258187 ను సంప్రదించాలని తెలిపారు.ఈ పరిశీలనలో డిఎస్ఓ జితేందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్

## "వందేమాతరం" భారతమాతకు వందనం!!

**మాతృభూమితో బలమైన భావోద్వేగం**

**సింగరేణిలో సామూహిక వందేమాతరం గీతాలాపన**

**ఆర్జీవన్ ఎస్ఓటు జీఎం చంద్ర శేఖర్**





**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 7 (వార్తాప్రభ ప్రతినిధి)** వందేమాతరం భారతమాతకు వందనం అని మాతృభూమితో బలమైన భావోద్వేగం అని సింగరేణి ఆర్జీవన్ ఎస్ఓటు జీఎం చంద్ర శేఖర్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిఎం కార్యాలయంలో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం చేపట్టారు. వందేమాతరం గీతం ప్రాధాన్యతను చాటి చెప్పేందుకే సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అధికారులు తెలిపారు. మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ "వందే మాతరం" జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సీ అండ్ ఎండి ఆదేశాల మేరకు శుక్రవారం జిఎం కార్యాలయంలో ఎస్ఓటు జీఎం చంద్ర శేఖర్ ఉద్యోగులతో కలిసి వందేమాతరం గీతాన్ని సామూహిక గానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జిఎం మాట్లాడుతూ........ ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు ఈ గీతం ఎంతగానో దోహదపడుతుందని, వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని సింగరేణి వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉన్నత అధికారులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జనసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఘనంగా వందేమాతర వార్షికోత్సవం




**శేరిలింగంపల్లి,నవంబర్ 7 (వార్తాప్రభ):**వందేమాతర గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మదీనాగూడ జనసిస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వందేమాతర వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా శుక్రవారం హాఫీస్ పెట్ డివిజన్ మదీనాగూడలోని జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎన్ సి సి క్యాడేట్స్ ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతిలో వందేమాతర గీతాలాపన చేశారు జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ 7 (టి) ఏ ఎన్ఓ గీత జోసెఫ్ వందేమాతర వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ మదీనాగూడ బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు నళిని దాది వైస్ ప్రిన్సిపల్ మరియా వినీషా 7 (టి) ఏఎన్ ఓ గీత జోసెఫ్ ఆర్టి బిటివై రవికుమార్ తో పాటు పలువురు ఎన్సిసి క్యాడెక్స్ అధ్యాపకులు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7, (వార్తాప్రభ) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని లక్ష్యంగా తీసుకుని రెహ్మత్ నగర్‌లో ఇంటింటికి కలసి పత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వందేమాతరం గీతం దేశభక్తికి నిర్వచనం

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ నవంబర్ 07 (వార్తాప్రభ):** వందేమాతరం గీతం దేశభక్తికి నిర్వచనం అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమానికి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్

# ఎడిటోరియల్

## బాబు పక్కా లెక్క.. నేతలు, అధికారులదే బాధ్యత

ఏపీ సీఎం చంద్రబాబు... అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రుల ముందు కొన్ని పక్కా లెక్కలు ఉంచారు. మనకు ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి? మనం ఎన్ని పరిష్కరిస్తున్నాం..? అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాదర్బార్‌లు.. ప్రజా స్పందన కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులపై ఇటీవల మంత్రి నారా లోకేష్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతలు సరిగా స్పందించి ఉంటే.. ఇన్ని వేల దరఖాస్తులు ఒకేసారి ఎలా వస్తాయని కూడా లోకేష్ ప్రశ్నించారు. తాజాగా సీఎం చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. అధికారుల తీరును కూడా ఆయన ప్రశ్నిం చారు. జిల్లాల వారీగా అందుతున్న దరఖాస్తులు.. పరిష్కారం అవుతున్నవి.. తూతూ మంత్రంగా పక్కన పెడుతున్నవీ.. ఇలా మూడు విభాగాలుగా ప్రజల నుంచి అందిన దరఖాస్తులను చంద్రబాబు ప్రస్తావిం చారు. ఇలా అయితే.. ఎలా అని ప్రశ్నించారు. కనీసంలో కనీసం 50 శాతం కూడా సమస్యలు పరిష్కరిం చక పోతే.. ఎలా అన్నది సీఎం చంద్రబాబు ఆవేదన."ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారు. వారి సమస్యలు పరిష్కారం అవుతాయని.. ఎంతో వ్యయ ప్రయాసల కు ఓర్చుకుని వస్తున్నారు. కానీ.. మనం ఏం చేస్తున్నాం.. అనేది ప్రశ్నగా మారకూడదు" అని హితవు పలికారు. ఈ క్రమంలో ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే స్పందనకు 4 వేల పైచిలుకు దరఖాస్తులు వస్తే.. కేవలం 1200 దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం చూపించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన దరఖాస్తు దారుల మాటేంటని ప్రశ్నించారు.ఈ విషయంలో ఒక్క జిల్లాలోనే ఇన్ని లోపాలు ఉంటే.. మిగిలిన జిల్లాల పరిస్థితి ఏంటని కలెక్టర్లను, మంత్రులను కూడా నిలదీశారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రజల సంతృప్తి మేరకు పనిచేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్ననేపథ్యంలో వాటిపై దృష్టి పెట్టాలని.. ముఖ్యంగా 22ఏ(అసైన్డ్ భూములు) సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజల సంతృప్తి ఉంటేనే ఎంత చేసినా.. ఫలితం వస్తుందన్నారు. దీంతో అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు చంద్రబాబు ప్రథమ ప్రాధాన్యం ఏంటనేది స్పష్టం చేసినట్టు అయింది.

## పెట్రోల్ పోసుకుని మహిళా ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని గుంటుపల్లిలో ఓ వివాహిత పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సేకరించిన సమాచారం ప్రకారం ఇబ్రహీంపట్నం ఫెర్రీ లోని వినాయకుడి గుడి వెనుక సాతుపాడు జ్యోతి (22) భర్త, ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. భర్త సాయి కొండపల్లి మున్సిపల్ (ఇబ్రహీంపట్నం పాత పంచాయతీ) ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. గురువారం గుంటుపల్లి - రాయనపాడు రోడ్డులో జ్యోతి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈ విషయాన్ని ఒక వ్యక్తి.. జ్యోతి భర్త సాయికి ఫోన్ లో తెలిపాడు. తీవ్రంగా గాయపడిన జ్యోతిని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. తనతో గొడవ పడటం వల్ల జ్యోతి ఆత్మహత్యకు పాల్పడలేదని, ఆమె మృతిపై వేరొక అనుమానం ఉందని, దానిపై పోలీసులు దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని మృతురాలి భర్త సాయి కోరుతున్నాడు. అతనికి మద్దతుగా మరికొంతమంది మున్సిపల్ కార్మికులు పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. ఇబ్రహీంపట్నం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రేష్ఠమైన వాక్కులు




ప్రేమించే హృదయాన్ని
ఖరీదైన సుగుణాన్ని
ఎప్పుడూ వదులుకోకు
శ్రేష్ఠమైన స్నేహాన్ని
కన్నవారి త్యాగాన్ని
వారు చూపు మార్గాన్ని
ఎప్పుడూ మరచిపోకు
జీవితాన ధర్మాన్ని
మితిమీరిన కోపాన్ని
హాని చేయు వాదాన్ని
తక్షణమే వీడాలి
మదిని ప్రతీకారాన్ని
హద్దులేని గర్వాన్ని
దిక్కుమాలినతనాన్నిజి
ఆదిలోనే తరమాలి
ఓర్వలేనితనాన్ని

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు సెల్:9966 414580

# రెండేళ్ల మీపాలనలో చెప్పుకునే పథకమేదైనా ఉందా బాబూ ?

**చంద్రబాబు కు వైసిపి నేత గౌస్ మొహిద్దీన్ సూటి ప్రశ్న ?**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తన రెండేళ్ల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వంతంగా ప్రకటించి అమలు చేసిన పథకం ఏదైనా ఉందా ? అని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు షేక్ గౌస్ మొహిద్దీన్ ప్రశ్నించారు.గ్రామ,వార్డు సచివాలయాలు దండగని ప్రకటించిన చంద్రబాబు కొద్ది రోజులకే మళ్ళీ యు టర్న్ తీసుకుని గ్రామ,వార్డు సచివాలయాలు ఇకపై విజన్ యూనిట్లు గా పని చేస్తాయని ప్రకటిం చడంపై శుక్రవారం వించిపేట లోని తన కార్యాలయంలో గౌస్ మొహిద్దీన్ మీడియా సమావేశంలో మాట్లాడారు.గత వైసిపి ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి ప్రకటించి అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చి తానేదో వాటిని కొత్తగా ప్రకటిస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు తీరుపై ప్రజలు నవ్విపోతున్నారని గౌస్ మొహిద్దీన్ అన్నారు.గత జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను - రైతు సేవా కేంద్రాలుగా,రైతు భరోసా పథకాన్ని- అన్నదాత సుఖీభవ గా,జగనన్న కాలనీలను- ఎన్టీఆర్ నగర్ లు గా, 'అమ్మ ఒడి' ని -తల్లికి వందనంగా,' గోరుముద్ద' ను-మధ్యానం భోజనం గా, విద్యా కానుకను -విద్యామిత్ర గా,వాహన మిత్రను -ఆటో డ్రైవర్ల సేవలో గా, మత్స్యకార భరోసాని -మత్స్యకారుల సేవలో గా,దిశా యాప్ ను-శక్తి యాప్ గా ఇప్పుడు గ్రామ,వార్డు సచివాలయాలని విజన్ యూనిట్లు గా మార్చుతూ ప్రకటించడం చూస్తే చంద్రబాబు కు అసలు సొంతంగా విజన్ ఉన్నట్లు లేదని గౌస్ మొహిద్దీన్ ఎద్దేవా చేశారు.పథకాల పేర్లు మార్చినంత తేలిక కాదు ఆయా పథకాలను అమలు చేయడమనేది వాస్తవంలో ఈరోజు ప్రజలకు అవగతమవుతోందని అన్నారు.ఈ రెండేళ్లలో షుమారు రెండున్నర లక్షల కోట్ల అప్పు చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇందులో ఏ ఒక్క పథకాన్నైనా సమర్ధంగా అమలు చేశారా ? అని గౌస్ మొహిద్దీన్ ప్రశ్నించారు ? సినిమాలో హీరో కి ఎలివేషన్లు ఇచ్చినట్లు తన సొంత ఎల్లో మీడియాలో రోజుకొక అర్భాటపు ప్రకటనలు చేస్తున్న చంద్రబాబు వాస్తవంలో ఏ ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని గౌస్ మొహిద్దీన్ దుయ్యబట్టారు.ఇకనైనా ఒట్టి మాటలు కట్టి చిత్తశుద్ధితో ఆయా పథకాల అమలుకు కృషి చేయాలని లేకుంటే పథకాల పేర్లు మార్చినంత తేలికగా ప్రజలను మోసం చేయవచ్చని అనుకుంటే అది ఆయన ఆత్మవంచన తప్ప మరొకటి కాదని,ప్రజలు కీలెరిగి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అది గ్రహించాలని ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ హితవు పలికారు..

# వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలి

**- విద్వాంసులు నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించింది - వందేమాతరం స్ఫూర్తి పథంలో యువత ముందడుగు వేయాలి - దేశభక్తిని, జాతీయతా భావనను పెంపొందించుకోవాలి - రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్**





**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందని.. విద్వాంసులు నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించిందని, వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఎన్ కళాశాలలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కేబీఎన్ కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులతో కలిసి భరతమాత చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. అదేవిధంగా వందేమాతరం రచయిత బంకిం చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దాదాపు మూడువేల మంది విద్యార్థులతో వందేమాతరం గేయాలాపన చేశారు. గౌరవ ప్రధానమంత్రి సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎందరో ప్రాణాలు త్యాగం చేశారని.. ఈ సందర్భంగా ఆ మహనీయులకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమానికి వేదికగా నిలిచిందని, ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఈరోజు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకు నేందుకు కారణమైన వందేమాతరం ఔన్నత్యాన్ని యువత తెలుసుకొని, దేశభక్తిని, జాతీయతా భావనను పెంపొందించుకొని ముందడుగు వేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి మాట్లాడుతూ కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు కులాలు మతాలకు అతీతంగా దేశ ప్రజల్లో వందేమాతరం స్ఫూర్తి నింపిందని, స్వాతంత్ర్య సాధనలో గొప్ప పాత్ర పోషించిందన్నారు. భావితరాలు కూడా వందేమాతరం స్ఫూర్తిని పుణికిపుచ్చుకొని ఐక్యతా భావనతో దేశాభివృద్ధికి కృషిచేయాలన్నారు. గౌరవ ప్రధాని పిలుపుతో దేశమంతా ఈ రోజు వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఇంత గొప్ప కార్యక్రమంలో భాగం కావడం చాలా ఆనందంగా ఉందని శాసనసభ్యులు సుజనా చౌదరి పేర్కొన్నారు.రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి వందేమాతరం శ్వాసగా నిలిచిందని.. ప్రతిఒక్కరి హృదయాల్లో నిలిచిందని పేర్కొన్నారు. ఈ మహోన్నత గేయ విశిష్టతను విస్తృతం చేసేందుకు కృషిచేయడం జరుగుతోందని.. గౌరవ ప్రధాని మార్గనిర్దేశనంతో ఏడాది పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు. వందేమాతరం స్ఫూర్తితో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ కళా వైభవంతో వందేమాతరం విశిష్టతను వ్యాప్తి చేసేందుకు అకాడమీ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్. మల్లికార్జున రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. వందేమాతరం దేశ ప్రజల్లో అచంచలమైన దేశభక్తిని పెంపొందించిందని, ఈ గేయం 150 ఏళ్ల వేడుకల్లో భాగంగా శుక్రవారం మొదలు ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నట్లు వివరించారు. వందేమాతరం స్ఫూర్తితో గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి ఆశయాలు అయిన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో

# 'వందేమాతరం' గేయానిది గొప్ప పాత్ర

**విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి**






**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో 'వందేమాతరం' గేయానిది గొప్ప పాత్రని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ గేయం 'వందేమాతరం'కి 150 సంవత్సరాలు పూర్తయ్యాయిన సందర్భంగా శుక్రవారం ఉదయం 'వందేమాతరం' గీతం పూర్తి రూపాన్ని సమూహంగా ఆలపించే కార్యక్రమంను విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో, వారిలో దేశభక్తిని నింపడంలో 'వందేమాతరం' గేయానిది గొప్ప పాత్ర అని, 'వందేమాతరం' నినాదంతో బ్రిటిష్ పాలకులకు భారతీయులు ఎదిరించారని అన్నారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన 'వందేమాతరం' గేయానికి 150 సంవత్సరాలు పూర్తైన నేపథ్యంలో ఏడాది పొడవునా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, నవంబర్ 7, 2025 నుంచి 2026 నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా సంవత్సరం పొడవునా కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ (జనరల్) ఏ.రవీంద్రరావు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో కోర్టులో చంద్రశేఖర్ అజాద్‌కు 16 కొరడాల దెబ్బల శిక్ష విధించగా, తనపై పడుతున్న ఒక్కొక్క దెబ్బకు వందే మాతరం అంటూ ఆ పోరాటయోధుడు అరిచాడంటే ఆ నినాదం స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతగా ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు అని అందరిలో స్ఫూర్తినింపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహదేవ్ అప్పాజీరావు, మరుపిళ్ళ రాజేష్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి వెంకటనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## వందేమాతరం గీతోత్సవాల్లో పాల్గొన్న పశ్చిమ తహసీల్దార్



**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వందేమాతరం గీతోత్సవాలు నగరంలో ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో విజయవాడ పచ్చిమ నియోజకవర్గం లో కాకరపర్తి భావ నారాయణ కాలేజీ లో జాతీయ గీతం 150 సంవత్సరాల జ్ఞాపకార్థం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ విజయవాడ సబ్ కలెక్టర్ కె.చైతన్య , విజయవాడ వెస్ట్ తహశీల్దార్ ఎస్ కే ఇంతియాజ్ పాషా కాలేజీ సిబ్బంధి అందరు పాల్గొని జాతీయ గీతం వేడుకలు విజయవంతం చేశారు.

## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే






**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే ఫ్రైడే నిర్వాహనతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం తుళ్లూరు వారి వీధి, నాలుగు స్తంభాల సెంటర్ మరియు కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వీఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు.అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, శానిటరీ సూపర్వైజర్ సోమరాజు గారు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

**నిబంధనలు ఉల్లంఘిస్తే మొబైల్ కోర్టులో హాజరు కావాల్సిందే**
**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాలతో రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు, శుక్రవారం ఉదయం సర్కిల్-3 కార్యాలయం పటమట నందు సర్కిల్-3 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 29 కేసులపై విచారణ జరిపి వారికి రూ 8,350/- రూపాయలు జరిమానా విధించారు.మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు.ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం మాట్లాడుతూ, రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ హెచ్ 3 డాక్టర్ గోపాల్ నాయక్ గారు, శానిటరీ సూపర్వైజర్స్ బాలాజీ శ్రీనివాస మూర్తి గారు, సర్కిల్ -3 సంబంధించిన శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ ఆసుపత్రిలో వందేమాతరం గీతోత్సవాలు




**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం వందేమాతరం గీతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సారమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆసుపత్రి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి గీతం ఉద్యమానికి మనోబలం తెచ్చిన శబ్ద తరంగం వందేమాతరానికి 150 సంవత్సరాలు పురస్కరించుకొని శుక్రవారం కొత్తపేట షేక్ రాజా ఆసుపత్రి నందు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా అధికారి డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

## కొండపల్లి మున్సిపల్ కో - ఆప్షన్ పదవులకు తొమ్మిది నామినేషన్లు

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపల్ కో - ఆప్షన్ పదవులకు నామినేషన్లు ముగిశాయి. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 7 వరకు మున్సిపల్ అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఎక్స్ పీరియన్స్, స్పెషల్ నాలెడ్జ్ కో - ఆప్షన్ పదవికి నాలుగు, మైనార్టీ జనరల్ కో - ఆప్షన్ కు మూడు, మైనార్టీ కో - ఆప్షన్ కు రెండు మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు నామినేషన్లను పరిశీలించనున్నారు. అనంతరం బరిలో ఉన్న కో - ఆప్షన్ అభ్యర్థులను ప్రకటించనున్నారు.

# సమస్యల్లేని నియోజకవర్గంగా బందరును తీర్చిదిద్దుతా

- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం - నియోజకవర్గంలోని ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాం - అభివృద్ధికి ప్రజల నుండి కూడా సూచనలు స్వీకరిస్తాం
- మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి కొల్లు రవీంద్ర.



**మచిలీపట్నం నవంబర్ 7 :(వార్తా ప్రభ (ప్రతినిధి)**నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటుగా, ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రధానంగా పెన్షన్లు, ఇళ్ల పట్టాల గురించిన గ్రీవెన్స్ వస్తున్నాయని, వాటన్నింటినీ పరిష్కరించి ప్రతి ఒక్కరికీ తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తోంది. వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నాం. ఒకవైపు సంక్షేమం అభివృద్ధి చేస్తూనే.. సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. అందుకు తాజాగా వచ్చిన తుపాను సమయంలో వారి పనితీరు నిదర్శనం అన్నారు. తుపాను తీరం దాటే సమయంలో ఆర్టీజీఎస్ నుండి పరిస్థితిని నిత్యం పర్యవేక్షించి ప్రాణ నష్టం సంభవించకుండా చూసుకున్నారు. అధికారుల్ని అప్రమత్తం చేసి తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. తుపాను సమయంలో పార్టీ నాయకులు, అధికారుల పనితీరు అభినందనీయం. తీరం దాటే సమయంలో ఇళ్ల నుండి ఎవరూ బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం వలన ప్రాణ నష్టం నివారించగలిగాం. 90 కి.మీల పైబడిన వేగంతో వచ్చిన గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కానీ, అధికారుల సమన్వయంతో 24 గంటల్లోనే విద్యుత్ పునరుద్ధరించాం. కూలిన చెట్లను గంటల వ్యవధిలోనే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూసుకున్నాం. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు కూడా సూచనలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి కేంద్రంగా మారుద్దామన్నారు. ఇళ్ల స్థలాలు, పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని, వాటన్నింటినీ వీలైనంత వరకు పరిష్కరించి పేదలకు అండగా ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

## ఆంధ్రా కురియన్ మండవ జానకి రామయ్య సేవలు ఆదర్శనీయం

**కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్ శ్రీ మండవ జానకి రామయ్య మృతికి సంతాపం**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రా కురియన్ దివంగత మండవ జానకి రామయ్య సేవలు ఆదర్శనీయమని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు.కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్ దివంగత మండవ జానకి రామయ్య మృతి పట్ల కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు , మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు , యూనియన్ అధికారులు, సిబ్బంది శుక్రవారం సాయంత్రం విజయవాడ ఫ్యాక్టరీ ఆవరణ లో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జానకి రామయ్య మృతికి సంతాపం గా రెండు నిమషములు మౌనం పాటించారు. మండవ జానకి రామయ్య మృతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్‌లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషి అమూల్యమని, సమితి సంక్షోభ సమయంలో చూపిన ధైర్యవంతమైన నాయకత్వం స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఆయన చొరవతో వి ఆర్ ఎస్ పథకాన్ని అమలు చేసి యూనియన్‌ను స్థిరపరిచిన తీరు ఆదర్శప్రాయమని అన్నారు. 27 సంవత్సరాల సుదీర్ఘకాలం కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, సంస్థను ప్రగతి పథంలో నడిపి చెరగని ముద్ర వేశారని ఆంజనేయులు పేర్కొన్నారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు శ్లాఘనీయం మరియు చిరస్మరణీయమని తెలిపారు.జానకి రామయ్య స్ఫూర్తితో కృష్ణా మిల్క్ యూనియన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపి, ఆయనకు ఘనమైన నివాళి అర్పించాలని ఈ సందర్భంగా ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పిలుపునిచ్చారు.

## బకింగ్ చంద్ర చటర్జీ కు ఘన నివాళులు



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 07(వార్తా ప్రభ ప్రతినిధి):** వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గీతాని రచించిన బకింగ్ చంద్ర చటోపపాధ్యాయ కు కేతనకొండ గ్రామ సచివాలయంలో ఘనంగా నివాళులర్పించారు.బకింగ్ చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందేమాతర గేయాన్ని ముక్తకంఠంతో ఆలపించారు. నాడు స్వాతంత్ర ఉద్యమానికి పూర్తి నిచ్చే విధంగా, భారతీయులందరూ గర్వపడేలా గేయాన్ని రచించడం... ఆ స్ఫూర్తితో నేటికీ భారతీయులందరూ కలిసి ఉండటం ప్రత్యేకతను తెలిపారు.ఈ కార్యక్రమంలో కేతనకొండ గ్రామ సర్పంచ్ నలకుర్తి నలిని ఆశలత, బిజెపి మండల అధ్యక్షురాలు, పంచాయతీ వార్డు సభ్యురాలు పయ్యావుల జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మల్లి మౌనిక, పయ్యావుల జయలక్ష్మి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 9న ముదినేపల్లిలో గౌడ సంఘ కార్తీక వనసమారాధన

**జయప్రదం చేయాలంటున్న ఛైర్మన్ బొర్రా శేషు.**



**ముదినేపల్లి నవంబర్ 7 (వార్తా ప్రభ)** కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం 21వ వార్షికోత్సవ కార్తీక వనసమారాధన ఈనెల 9వ తేదీ ఆదివారం జరుగనుందని, కార్యక్రమానికి సంఘీయులంతా కుటుంబసమేతంగా తరలిరావా లని వన సమారాధన కమిటీ ఛైర్మన్ బొర్రా శేషు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ముదినేపల్లి మండలం, వడాలి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సుభద్రా బలరామసహిత శ్రీ జగన్నాథస్వామివారి ఆలయ ప్రాంగణంలో కార్తీక సమారాధన నిర్వహించనున్నామన్నారు. ఉదయం ఉసిరి చెట్టుకు పూజ, అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. తదుపరి సమారాధన సభ జరుగుతుందని, సభలో సంఘ పెద్దలు తమ అమూల్యమైన సందేశాన్ని వినిపిస్తారని, మధ్యాహ్నం 12 గంటల నుండి కార్తీక సమారాధన (భోజనాలు) జరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని గౌడ సంక్షేమ సంఘం కుటుంబసభ్యులు, బంధుమిత్ర సపరివార సమేతంగా హాజరై కార్తీక వన సమారాధనను విజయవంతం చేయాలని బొర్రా శేషు కోరారు.

## “వార్తాప్రభ తెలుగు దినపత్రిక”లో ప్రచురితమైన “పాల లారీ దెబ్బకి ట్రాఫిక్ జాం “ అనే శీర్షికపై స్పందించిన ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు...



**గుంటూరు నవంబర్ 7 ( వార్తాప్రభ ప్రతినిధి ):**కొత్తపేట క్లాత్ బజార్ లో రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలుపుదల చేసి నిర్వహిస్తున్న పాలు,పాల పదార్థాలు విక్రయిస్తున్న అంగడి నిర్వాహకులకు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తమదైన శైలిలో స్పందిస్తూ...మీ పొట్టకొట్టాలన్న ఉద్దేశమేమి కాదు...శంకర్ విలాస్ సెంటర్ ఫ్లైఓవర్ నూతన నిర్మాణములో ఉన్న దశయందు టూ టౌన్ కి వెళ్ళే ట్రాఫిక్ ని కొత్తపేట క్లాత్ బజార్ మీదుగా తరలిస్తున్న క్రమములో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు వ్యాపారస్తులు తమవంతుగా ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించి కృతజ్ఞతా భావంతో మెదలి మీ మీ వ్యాపారాలు సంవృద్ధిగా నిర్వహించుకోవాలని పలు రకాలుగా సూచనలను కూలంకషంగా తెలిపారు.ట్రాఫిక్ పోలీస్ వారు మీ మీ వ్యాపారాలు దృష్టిలో ఉంచుకొని వ్యాపారాలకు ట్రాఫిక్ ఎద్దడి వాటిల్లకుండా వ్యాపార అభివృద్ధికి తోడ్పాటుకు కల్పించిన నియమాలను అనుసరించి సహకరిస్తూ వ్యాపారాలు కొనసాగించుకోవాలే తప్పా...బలాదూర్ గా భావించి అహం భావనతో ఉల్లంఘించిన యెడల ట్రాఫిక్ పోలీస్ వారు నిర్మోహమాటంగా చట్టరీత్యా తీసుకొనే తగు చర్యలకు బాధ్యులు కాగలరని హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరు దేశ అభివృద్ధికి ప్రగతికి పాటుపడాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వందేమాతరం జాతీయ గీతం స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా భారత దేశ ప్రగతికి, అభివృద్ధికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ జాతీయ పతాకం ముంగిట జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్, సహాయ కలెక్టర్ పర్వీన్ జాహిద్ లతో కలిసి జాతీయ పతాకం చేతబూని వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ వందేమాతరం గీతం రచించి శుక్రవారంతో 150 సంవత్సరాలు అయిందన్నారు. వందేమాతరం గీతం స్ఫూర్తినిచ్చే శక్తివంతమైన గీతమన్నారు. ఒకే సంస్కృతి ఒకే భాష మాట్లాడే వారిలో ఐక్యత పెంపొందాలనే ఉద్దేశంతో స్వాతంత్ర సమరయోధులు బంకించంద్ర చటర్జీ వందేమాతర గీతాన్ని రూపొందించారన్నారు.రాష్ట్ర ఆధారంగా గాని, భాష ఆధారంగా గాని లేదా ఏ ఇతర ఆధారంగా గాని ఎటువంటి విభేదాలు లేకుండా భరతమాత ముద్దుబిడ్డలుగా అందరము కలిసిమెలిసి భారతదేశ ప్రగతి, అభివృద్ధికి పాడుపడదామన్నారు చరిత్రను ఒకసారి గుర్తు చేసుకుంటే 1905 సంవత్సరంలో బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్ రాష్ట్రాన్ని తూర్పు, పశ్చిమ బెంగాల్ గా విభజించారన్నారు. ఈ విభజనను వ్యతిరేకిస్తూ దేశంలో చాలా ఉద్యమాలు చేశారన్నారు. ఆ సమయంలో వందేమాతరం గీతం చాలా ప్రసిద్ధి చెందిందన్నారు. విడిపోయిన బెంగాల్ ని కలపడానికి వందేమాతర గీతం అందరికీ స్ఫూర్తినిచ్చిందన్నారు. మనందరికీ మాతృభూమి భరతమాత అనే భావంతో ఈ గీతం వ్రాశారన్నారు. వందేమాతర గీతం రాజకీయ విప్లవం, చరిత్రలో ఒక మలుపు తీసుకొచ్చిందన్నారు. మనందరం కూడా ఒకే దేశంలో ఉన్న ప్రజలమనే భావనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, డిఎస్ఓ మోహన్ బాబు డి టి డబ్ల్యూ ఓ ఫణి ధూర్జటి, సమాచార శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడి మణిధర్, కలెక్టరేట్ ఏవో రాధిక తదితర అధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు

## తన సంపాదనంతా తిరిగి సమాజానికే ఇచ్చేసిన” ఆదర్శ వైద్యుడు” డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు

**డాక్టర్ కోటేశ్వరరావు సంతాప సభలో డాక్టర్ టీ. సేవకుమార్**



**గుంటూరు టౌన్ నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తన జీవితకాలం అంతా ,వైద్యునిగా అతి తక్కువ ఖర్చుకి వైద్య సేవలు అందించి ,చివరకు తన సంపాదనంతా కూడా సమాజానికే స్వచ్ఛందంగా ఇచ్చేసిన ఆదర్శ వైద్యులు, సమాజ హితి డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు అని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టీ సేవ కుమార్ అన్నారు. శుక్ర వారం ఉదయం స్థానిక బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ మీటింగ్ హాల్లో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లినిక్ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు సంతాప సభ జరిగింది. తొలుత డాక్టర్ కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం డాక్టర్ సేవకుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని తాళ్లూరు మండలం, మారుమూల గ్రామం మాధవరంలో ఒక పేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ కోటేశ్వరరావు తిరుపతిలోని శ్రీ ఎస్వీ వైద్య కళాశాల నుండి వైద్య విద్యలో పట్టా పొందారున్నారు .తర్వాత గుంటూరులో దీప్తి నర్సింగ్ హోమ్ ను స్థాపించి 40 సంవత్సరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ఖర్చుకే వైద్య, శస్త్ర చికిత్సల సేవలందిస్తూ లక్షలాదిమంది ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. ఎస్ హెచ్ ఓ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ- పారామెడికల్ సంస్థలో మైక్రో బయాలజీ అధ్యాపకునిగా ఎస్ హెచ్ ఓ కు పరిచయమైన ఆయన ,తర్వాత ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లినిక్ లో 12 సంవత్సరాలపాటు బీపీ, షుగర్ బాధితులకు విశేష సేవలు అందించారన్నారు. ఆస్తులు సంపాదించినా... అతి సాధారణ జీవితం గడిపిన ఆయన, అనేక ఆశ్రమాలకు ప్రజాహిత భవనాలకు ,పేద విద్యార్థులకు లక్షలాది రూపాయలను విరాళంగా ఇచ్చారన్నారు . అరండల్ పేటలోని పుండరీ కాక్షుడు పార్కులో తెలుగు తల్లి విగ్రహంకు ఆయనే విరాళాలు ఇచ్చారన్నారు. అంతేగాక తన స్థిరాస్తులు అమ్మి వచ్చిన ధనంతోను, తన దగ్గర గల ధనంతోను ,తన తల్లిదండ్రుల పేరున, తన పేరున “పులిపాటి కోటమ్మ ,రామయ్య అండ్ డాక్టర్ కోటేశ్వరరావు “(పీకేఆర్ అండ్ డాక్టర్ కేఆర్) ట్రస్టునుఏర్పాటు చేసి, ఆ ట్రస్టు ద్వారా గుంటూరు నగరం లోని డొంక రోడ్డులో ఒక కళ్యాణ మండపం, అమరావతి రోడ్ లో ఒక బాలుర హాస్టల్ , అరండల్ పేటలో ఒక బాలికల హాస్టల్ నిర్మించాలని భావించి వెంటనే నిర్మాణాలను ప్రారంభించడం సమాజ అభివృద్ధిపై ఆయనకు గల తృష్ణను తెలియజేస్తుందన్నారు. దురదృష్టవశాత్తు డాక్టర్ కోటేశ్వరరావు ఆ భవనములలో సేవలు చూడకుండానే మరణించడం అత్యంత దురదృష్టకరమన్నారు .ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా ,ఆయన ఆత్మ ఆ భవనాల చుట్టూనే తిరుగుతూ ఉంటుందని, ట్రస్ట్ సభ్యులందరూ ఆ భవనాల నిర్మాణాలను పూర్తి చేసి ఆయన ఆశించిన సేవలు అందించడం ప్రారంభించినప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు .సంతాప సభలో పాల్గొన్న డాక్టర్ కోటేశ్వరరావు సన్నిహిత మిత్రులు కన్నా మాస్టారు మాట్లాడుతూ తన సంపాదనను, తన కనీస అవసరాలకు కూడా ఖర్చు చేయకుండా మొత్తం ప్రజా హితానికే ఖర్చు చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కోట్లకుఅధిపతి అయినా చివరకు ,చివరి దశలో కూడా ఆయన ఒక చిన్న గదిలో అతి సాధారణ జీవితం గడిపారన్నారు .భార్య, కుమార్తెలు అమెరికాలో సురపడ్డారన్నారు. తన జీవితకాలంలో అంత సమాజ అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తిని తాను చూడలేదన్నారు.సభలో పాల్గొన్న ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ డయాబెటిక్ క్లినిక్ వైద్యులు డాక్టర్ ఆర్ .నాగేశ్వర రావు మాట్లాడుతూ వైద్య వృత్తిపరంగా, సమాజ సేవల పరంగా డాక్టర్ కోటేశ్వరరావు సేవలు చిరస్మరనీయమైన వన్నారు .మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ ఛైర్మన్ టి .ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ తనకు క్యాన్సర్ వ్యాధి సోకిందని తెలిసినప్పుడు కూడా ఆయన ఏమాత్రం ఆత్మ నిబ్బరం కోల్పోలేదన్నారు. ఒకవైపు తాను వైద్యం పొందుతూనే, మరోవైపు తనకోసం వచ్చే బీపీ, షుగర్ బాధితులు ఏమాత్రం ఇబ్బందికి గురికాకుండా ఎస్ హెచ్ ఓ కు వచ్చి వైద్య సేవలు అందించేవారు అన్నారు. వారికి వైద్య వృత్తిపై గల నిబద్ధతను ఇదే నిదర్శనం అన్నారు .సంతాప సభలో ఎస్ హెచ్ ఓ మేనేజర్ పి .నిర్మల రాణి, జీవీఎస్ఎస్ ప్రసాద్ ,వి సదాశివరావు ,కావూరి సత్యనారాయణ ,రమణబాబు, కోట సత్యం ,గుర్రం వీరయ్య, శ్రీనివాసరావు, పి నరసింహారావు, మేకా రామారావు ,వెంకటేశ్వరరావు తదితరులు డాక్టర్ కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, డాక్టర్ కోటేశ్వరరావుతో, తమకు గల అనుబంధాలను, అనుభవాలను పంచుకున్నారు.

### లుంబిని లో జాతీయ జెండాలతో వందేమాతరం



**చేజర్ల నవంబర్ 07 (వార్తాప్రభ)** వందేమాతరం పాట పాడి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా లుంబిని విద్యాలయం విద్యార్థులతో ఆ పాఠశాల యాజమాన్యం శుక్రవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించుట జరిగింది. విద్యార్థులతో వందేమాతరం గేయాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ భారతదేశానికి వందేమాతరం అత్యున్నతమైన గేయంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయనులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో ప్రజా నాయకుడిని ఆపలేరు.

**ప్రభుత్వం బివైసి పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ ను వేధించాలని చూస్తుంది.**

**బివైసి పార్టీ కైకలూరు నాయకులు తోకల రామకృష్ణ**




**కైకలూరు నవంబర్ 7 (వార్తా ప్రభ)** రాష్ట్రంలో ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగినా, బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడు రాష్ట్ర బివైసి పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పై ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరోధమని బీవైసీ పార్టీ కైకలూరు నాయకులు తోకల రామకృష్ణ గారు తీవ్రంగా ఖండించారు.ఆయన మాట్లాడుతూ “ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుండే, బాధితులకు తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందించే నాయకుడిని ఇలా కేసులతో అడ్డుకోవడం అన్యాయం. ఇలాంటి తప్పుడు చర్యలతో ఆయనను ప్రజల నుండి దూరం చేయడం సాధ్యం కాదు. ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన నాయకుడిని ఎవ్వరూ అణగదొక్కలేరు” అని పేర్కొన్నారు.రామకృష్ణ ఇంకా మాట్లాడుతూ, “ప్రజా సేవే ధ్యేయంగా పని చేస్తున్న వ్యక్తిని తప్పు ఆరోపణలతో వేధించడం అసహ్యకరమైన విషయం. ఇలాంటి ప్రయత్నాలు కొనసాగితే బహుజన సమాజం అంతా ఏకమై తగిన గుణపాఠం చెబుతుంది. ప్రజా సేవకు అడ్డుకట్ట వేయాలని ప్రయత్నించే వారు చివరికి ప్రజల తీర్పు ఎదుర్కోవాల్సి వస్తుంది” అని హెచ్చరించారు.ప్రజల కోసం, వారి హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తున్న నేతకు ప్రజా మద్దతు మరింత పెరుగుతుందని, సత్యం ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీవైసీ పార్టీ నాయకులు తోకల రామకృష్ణ, నున్న అనిల్, మీగడ రాము, మీగడ నాగరాజు, ఎండ్రపు హరీష్, వీర్ల వెంకట నాగ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ న్యాయ సేవా దినోత్సవం.





**మచిలీపట్నం నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి ముఖ్య అతిథిగా పాల్గొని అనేక చట్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. మనుష్యుల ఆలోచన ధోరణి మారాలి తద్వారా మంచి సమాజ నిర్మాణానికి అందరూ దోహద పడాలి అని తెలియ చేశారు. నేరాలను అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది అని తెలియచేశారు. అలాగే ఈ కార్యక్రమం లో పడవ అదనపు జిల్లా జడ్జి బాబు నాయక్ ప్రసంగించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పాల్గొని అనేక చట్టాలు అనగా ఫోక్సో, మహిళా చట్టాలు, ఆస్తి బదలాయింపు చట్టాలు, సైబర్ నేరాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ తదితర చట్టాల పట్ల అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి సెక్రటరీ , అదనపు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ యుగంధర్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. అలాగే న్యాయ సేవా అధికార చట్టం మరియు కార్యకలాపాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ సిబ్బంది, ప్యానెల్ లాయర్లు, పి ఎల్ వి లు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### స్వాతంత్ర పోరాటంలో ప్రతి ఒక్కరి నోట వందేమాతరం



**మంగళగిరి, నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మన జాతీ గొప్పతనం, ఔన్నత్యం నలువైపుల చాటిచెప్పిన గొప్ప గేయం వందేమాతరం మని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం శనివారం ఆయన మాట్లాడుతూ 150 ఏళ్ళ చరిత్ర కలిగిన వందేమాతరం గేయాన్ని 145 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ ఆనందంగా పాడుకోవడం చాలా గొప్ప విషయమని ఆయన తెలిపారు భారత దేశ గొప్పతనం వర్ణిస్తూ బంకించంద్ర చటర్జీ 150 ఏళ్లు సజావుగా నిలిచేలా వందేమాతరం గేయం రాశారన్నారని ఆయన తెలిపారు. ప్రతీ భారతీయుడు గర్వించేలా వందేమాతరం గేయం రూపొందించారన్నారు. క్రూరంగా హింసిస్తే వారి నోట స్వాతంత్ర్య ఉద్యమంలో భారతీయుల కుల, మత, ప్రాంతాల ఐక్యతకు వందేమాతరం గేయం పునాదిగా నిలిచిందన్నారు. ప్రభుత్వం మారకుండా ఉంటే ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉంటుందన్నారు. స్వాతంత్ర పోరాటంలో ప్రతి ఒక్కరి మాట వినిపించిన పదం వందేమాతరం అని ఆయన అన్నారు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యాములం అయ్యిందని పాతర్ల రమేష్ అన్నారు

## ఏడాదిన్నర పాలనలోనే ఎన్నో విజయాలు సాధించాము.

**గ్రామ సీమలు రహదారులు నిర్మాణంతో రాష్ట్రం అభివృద్ధిలో ముందడుగు.**

**రూ 70 లక్షలతో కొర్లగుంట, వేల్పుచర్ల గ్రామంలో సిసి రహదారులకు శంకుస్థాపనలు.**

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ...**



**ఏలూరు/ముసునూరు, నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ముసునూరు మండలం కొర్లగుంట ,వేల్పుచర్ల గ్రామంలో రూ 70 లక్షలతో సిసి రహదారులకు, కొర్లగుంట - సింహాద్రిపురంలో రూ 2.30 లక్షలు ( 90 శాతం సబ్సిడీ) మినీగోకులం అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రజలు, మహిళలు పూలమాలలు వేసి మంత్రి కొలుసు పార్థసారథి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఏడాదిన్నర పాలనలోనే ఎన్నో విజయాలు సాధించామని, రానున్న రోజులు అన్ని మంచి రోజులేనని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల మనోభావాలు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం లో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు బ్యాలెన్సుగా ముందుకు సాగుతూ దేశంలో ఏక్కడ లేనివిధంగా పెద్దమొత్తంలో పెన్షన్లు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నాక్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం రూ 15 లకే మూడుపూటలా కడుపునిండా భోజనం పెట్టి నిరుపేదలు ఆకలి తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తల్లికి వందనం అమలు చేసి, కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి రూ 15 రూపాయలు చొప్పున అందిస్తున్నామని అన్నారు. డిఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయుల పోస్టులను నియమించామని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి.యల్.సుందరి, తహశీల్దారు డి.ప్రశాంతి, యంపిడిఓ పి.ఏసుబాబు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడులో డిసెంబర్ 21న బాలల పండుగ

- నూజివీడు బాలోత్సవం 2 వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- గతము కంటే ఘనంగా సర్వం సిద్ధం
- ఒత్తిడి నుండి విముక్తికి బాలోత్సవం నింపే నూతన ఉత్తేజం
- బానోత్సవ నిర్వహణపై పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరణ
- ఉత్సవ కమిటీ అధ్యక్షులు డాక్టర్ వి రాఘవరావు, ప్రధాన కార్యదర్శి బిఎల్బి కోటేశ్వరి, సమన్వయకర్త ఎన్ఆర్ హనుమాన్లు, ఎంఈఓ సుబ్బారావు



నూజివీడు **నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు పట్టణంలోని ఎన్జీవో హోం నందు శుక్రవారం నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ 2 వేడుకలపై పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగా 2 ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ వి రాఘవరావు, ప్రధాన కార్యదర్శి బి ఎల్ బి కోటేశ్వరి, సమన్వయకర్త ఎన్నార్ హనుమాన్లు, ఎంఈఓ సుబ్బారావు లు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగా మొదటి వేడుకను మించి ఈ రెండవ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సకల సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సెయింట్ థామస్ హై స్కూల్ ఆవరణములో డిసెంబర్ 21వ తేదీ ఆదివారం నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ 2 ఉత్సవాన్ని నిర్వహించేందుకు తగిన ఏర్పాటులు చేశామన్నారు. సమాజంలో నిత్యం అనేక అంశాలలో పోటీపడుతూ ఒత్తిడికి గురికాకుండా ఉండే రీతిగా నూజివీడు బాలోత్సవాన్ని చిన్నారి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ బాలోత్సవ కార్యక్రమంలో అనేక సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారులలో ఉత్సాహం మరింతగా రెట్టింపు అవుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో చిన్నారి విద్యార్థులలో కొత్త ఉత్తేజం, ఉత్సాహం నిండి చదువు పట్ల మరింత ఆసక్తి పెంపొందడం ద్వారా అటు చదువులోనూ, క్రీడాంశాలలోనూ, ఇతర సామాజిక అంశాల పట్ల లోతైన పరిశీలన, పరిశోధనా చేసే సత్తా విద్యార్థులలో నెలకొంటుందన్నారు. విద్యార్థి దశ ముగిసి జీవితాలలోకి అడుగుపెట్టే సమయాలలో నేటి విద్యార్థులు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే రీతిగా సంసిద్ధం కాగలరని ఆకాంక్షించారు. అందుకోసం అన్ని వర్గాల ప్రజలు, సామాజికవేత్తలు, పలు ప్రజాసంఘాల నాయకులు సహకరించి, సలహాలు సూచనలు అందించడం ద్వారా ప్రోత్సహించి నూజివీడు బాలోత్సవం పిల్లల పండుగ 2 ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నిర్వహణ కు ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగ శ్రీ బొర్రా గోపి మూర్తి, ఉపాధ్య ఏమ్.ఎల్.సి,గౌరవ ఉపాధ్యక్షులుగా సిహెచ్ఎల్ రమేష్ బాబు, బ్రదర్ కిషోర్ కుమార్ లు, అధ్యక్షులు గా డాక్టర్ వి రాఘవ రావు, ప్రధాన కార్యదర్శి గా శ్రీమతి బి.ఎల్.బి. కోటేశ్వరి, ఉపాధ్యక్షులుగా : శ్రీమతి పి ఉదయలక్ష్మి, డి మోహనరావు, శిఖా ఆకాష్, ఎస్కే సుభాని, ఎం బాలు, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గ శ్రీ కె గంగేయుడు, కార్యదర్శులు గా ఏ కే డి ప్రసాద్, ఎస్ కే సలీం బాబు, పి శివన్నారాయణ, కృష్ణవేణి, జె.మధు లతో ఏర్పడింది. మరియు ఉపాధ్యాయులు శ్రీ డి బెనర్జీ, జే మధు, శ్రీమతి బత్తుల అనురాధ , మార్ష తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం నినాదంతో మార్మోగిన నూజివీడు పట్టణం.






**నూజివీడు: నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బంకించంద్ర ఛటర్జీ ద్వారా 1875 నవంబర్ 7న లో సంస్కృతంలో రచింపబడి, దేశ స్వాతంత్య ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన భారత జాతీయ గీతంవందేమాతరం, నేటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్రివిధ పాఠశాల విద్యార్థులు గౌరవ సూచకం గా వందేమాతరం 150 మానవాకృతి రూపంలో ఏర్పడ్డారు. అదేవిధంగా నూజివీడు పట్టణంలో పలు విద్యాసంస్థలు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు వారి యొక్క పాఠశాలల నుండి వందేమాతరం, వందేమాతరం అని నినాదాలతో నూజివీడు పట్టణ పురవీధుల మీదగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సబ్ కలెక్టర్ తో ముఖాముఖి నిర్వహించారు.

## విభిన్న ప్రతిభావంతులు ఎన్ హెచ్ ఎఫ్ డి సి లోన్లు సద్వినియోగం చేసుకోవాలి

**- ఏ. పి. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షఫీ**



**అనంతపురం, నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్ కింద విభిన్న ప్రతిభావంతులకు మంజూరు చేసే హెచ్ ఎఫ్ డి సి కార్పొరేషన్ లోన్లు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షఫీ ఓ ప్రకటనలో తెలిపారు. శు క్రవారం శ్రీ సత్య సాయి జిల్లాలో వివిధ గ్రామాల నుండి విభిన్న ప్రతిభావంతులు వివిధ వ్యాపారాలు స్వయం ఉపాధి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం నుండి విడుదలయ్యే ఎన్ హెచ్ ఎఫ్ డి సి లోన్ల దరఖాస్తులను ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఏడి అర్చనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలో జిల్లావ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ సైకిల్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నట్లు ఏడి అర్చన తెలిపినట్లు ఆయన తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరికి బ్యాటరీ సైకిల్ అందజేయడం జరుగుతుందని సందర్భంగా ఏడి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హత గల విభిన్న ప్రతిభావంతులకు 10 త్రిచక్ర వాహనాలను అందించినట్లు ఆమె తెలిపినట్లు రాష్ట్ర అధ్యక్షులు షఫీ ఈ సందర్భంగా అన్నారు. అలాగే పలు దివ్యాంగ సమస్యలపై ఏడి అర్చన తో చర్చించినట్లు అయన తెలియజేసారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో డిసెంబర్ 3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం జరపనున్నట్లు ఆ కార్యక్రమానికి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గుడి పూటి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా రానున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఎన్ హెచ్ ఎఫ్ డి సి లోన్ల విషయంపై సమాచారం కొరకు రాష్ట్ర అధ్యక్షులు షఫీ సంప్రదించిన యెడల పూర్తి వివరాలు తెలుపగలరని క్రింది ఫోన్ నెంబర్ కు 94930 41966 ఫోన్ చేసి సంప్రదించిన వివరాల తెలుపగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు దేవిబాయ్, ఈశ్వరప్ప, గోపాల్ నాయక్, వెంకట్ నాయుడు, భూదేవి, సురేష్,స్వరూప రాణి పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ వి వైద్య కళాశాలలో వందేమాతరం గీతం



**తిరుపతి : నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎస్ వి వైద్య కళాశాల ఆవరణలో అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు శుక్రవారం వైద్య విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ద్వారా వందేమాతరం గీతాన్ని ఆలపించారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు, సిబ్బందితో కలిసి "వందే మాతరం" గీతాన్ని ఆలపించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "వందేమాతరం కేవలం ఒక గీతం మాత్రమే కాదు, అది మన తల్లి భారత మాత పట్ల ఉన్న భక్తి, గౌరవం, త్యాగం, దేశ సేవాస్ఫూర్తికి ప్రతీక. ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. ప్రతి భారతీయుని హృదయంలో 'వందేమాతరం' అనే మాట ఒక భావోద్వేగ జ్వాలలా వెలిగిపోవాలి," అని వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ గీతం మనలో దేశభక్తిని మరింత బలపరుస్తుంది. ఈ రోజు వంటి సందర్భాలు మన బాధ్యతను గుర్తుచేస్తాయి," అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డిఎస్ఎన్. మూర్తి, డాక్టర్ మనోహర్, డాక్టర్ సునీత, డాక్టర్ రామ్మోహన్, పలు విభాగాధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది తదుతరులు పాల్గొన్నారు.

## ఆ గుండె శబ్దం మరో వందేళ్లు వినాలంటున్న ప్రజలు



**విస్సన్నపేట నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలో నరసాపురం గ్రామంలో ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు టిడిపి సీనియర్ నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు అలియాస్ బుడ్డయ్య నిస్వార్థపూరిత ఆలోచనలు ప్రజలకు మేలు చేస్తున్నాయని ప్రతి ఒక్కరి నోట వినిపిస్తుంది. పైసా మే పరమాత్మ అన్న చందంగా నేటి సమాజంలో ఆర్థికంగా ఎదగాలని రూపాయి జతగా మరొక రూపాయి కూడా పెట్టుకోవాలని ఒక్కొక్కరు గజ కర్ణ గోకర్ణ టక్కుటమార విద్యలను ప్రదర్శిస్తూ తియ్య తియ్యని తేనెల వంటి మాటలు చెప్పి తమ పబ్బం గడుపుకుంటున్న ఈ రోజులలో 16 లక్షల రూపాయలు రామాలయాన్ని కట్టిన గోపన్న వలె ఖర్చుపెట్టి 1300 మీటర్లు జి ఎస్ టి రోడ్డును ఏర్పాటు చేయడం జరిగింది. నరసాపురం పశువుల ఆస్పటల్ నుండి జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపర్ల బజార్ విద్యుత్తు సబ్ స్టేషన్ వయా పంచాయతీ ఆఫీస్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన రోడ్ల వలన రైతులు విద్యార్థులు విద్యుత్ వినియోగదారులు నరసాపురం నుండి మారేమండ మీదుగా తిరువూరు నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే వాహనదారులకు కూడా రహదారి సమస్య తీరినట్లు అయిందని చెప్పాలి. జిల్లా పరిషత్ హై స్కూలుకు వెళ్లే విద్యార్థులు ఇష్టంగా చదువుకునేందుకు బుడ్డయ్య వేసిన రహదారి ఇష్టంగా చదువుకునేందుకు సుదీర్ఘకాల పునాదులు వేసిందని చెప్పాలని అలాంటి వ్యక్తి గుండె చప్పుడు మరో వందేళ్లు వినాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

## క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-డాక్టర్ సాయి ప్రసన్న**




**తోట్లవల్లూరు, నవంబర్ 7 (వార్తా ప్రభ):** క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాయి ప్రసన్న తెలియజేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో క్యాన్సర్ అవగాహన దినోత్సవ ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. ప్రజలకు క్యాన్సర్ పట్ల ఉన్న అపోహలను మరియు ఆరోగ్య జాగ్రత్తలను మరియు ఆహారపు అలవాట్లను డాక్టర్ సాయి ప్రసన్న తెలియజేశారు. క్యాన్సర్ లోని రకాలు నోటి క్యాన్సరు, గర్భసంచి క్యాన్సర్, రొమ్ము క్యాన్సరు,శరీరంలోని ప్రతి భాగమునకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నదని ఆమె అన్నారు. క్యాన్సర్ రాని భాగాలు తలలోని వెంట్రుకలకు, చేతులు మరియు కాళ్ల గోళ్ళకు మాత్రమే క్యాన్సర్ రాదని తెలిపారు. మనం తీసుకునే ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్స్, బాగా నూనెలో వేయించిన మసాలా దినుసులతో కూడిన ఆహార పదార్థాలు వల్ల క్యాన్సర్ వ్యాధి బాగా విస్తృతంగా ప్రభలుతోందని సాయి ప్రసన్న చెప్పారు. బయట ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ ఇంటి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని ఆమె సూచించారు. సి హెచ్ ఓ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్ అనిల్ కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతే దేశ భవిష్యత్తు - చట్టాన్ని గౌరవించే పౌరులుగా ఎదగాలి

**ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




**జగిత్యాల, నవంబర్ 7 (వార్తా ప్రభ):::** యువతే దేశ భవిష్యత్తు కాబట్టి, వారు చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారంకొండగట్టు జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ .. "విద్య అనేది కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాదు, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించడానికి ఉపయోగపడే ఆధ్యాత్మిక శక్తి అని ప్రతి విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, కష్టపడి చదువుకోవడం, ముఖ్యమని" అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ విలువలను అలవరచుకోవాలి," అని అన్నారు. యువతే దేశ భవిష్యత్తు కాబట్టి, వారు చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా, దానిని నేర్చుకోవడానికీ, కొత్త ఆలోచనలను అభివృద్ధి చేసుకోవడానికి వినియోగించుకోవాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, తెలియని లింకులు, ఫేక్ ఐడీలకు స్పందించకూడదని సూచించారు. కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు విద్యార్థుల నడవడిక, ప్రవర్తన పట్ల శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. సీనియర్లు–జూనియర్లు అనే తేడా లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించాలని, ర్యాగింగ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని, సమాజంలో ఆదర్శవంతులుగా నిలవాలని అన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకం భవిష్యత్తును నాశనం చేస్తుందని ఈలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ వారికి అందివ్వాలని తెలిపారు. విద్యార్థులు చేడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుని,కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

## భారతీయులకు స్ఫూర్తినిచ్చిన గేయం వందేమాతరం

**బెల్లంపల్లి నవంబర్ 7 (వార్తా ప్రభ)** జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న అద్భుతమైన గేయం ు వందేమాతరం. వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బ్రాంచ్ ఉన్నత పాఠశాలలో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించి దేశభక్తి జ్వాలలు రగిలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ు వందేమాతరం గేయాన్ని బంకించంద్ర చటర్జీ రచించారని, స్వాతంత్ర్య సమరయోధుల్లో దేశభక్తిని రెచ్చగొట్టిన ఈ గీతం జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

## రసాయన పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల పెంపు ఆవశ్యకత

**(సి.హెచ్.ప్రతాప్)**

రసాయన పరిశ్రమలు దేశ అభివృద్ధికి ప్రధాన ఆధారాలు. వ్యవసాయ ఎరువుల నుండి ఔషధాలు, పరిశ్రమల పదార్థాలు, రబ్బరు, ప్లాస్టిక్, విద్యుత్ పరికరాలు, శుభ్రపరిచే రసాయనాలుమన జీవితంలో ఉపయోగించే అనేక వస్తువులు ఈ పరిశ్రమల ద్వారా అందుతాయి. అయితే రసాయన పదార్థాల స్వభావం సున్నితమైనదిబీ వీటికి అగ్ని, వేడి, చల్లదనం, ఒత్తిడి, కలయిక వంటి అంశాలపై ప్రత్యేక ప్రతిస్పందనలు ఉంటాయి. అందువల్ల రసాయన పరిశ్రమల్లో భద్రత అత్యంత ప్రాధాన్యమైనది. ఇటీవలి నెలల్లో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాలు జాగ్రత్తలు మరింత అవసరమని స్పష్టంగా తెలియజేశాయి. గుజరాత్‌లోని ఒక రసాయన కర్మాగారంలో అగ్ని ప్రమాదం కారణంగా అనేక మంది కార్మికులు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన గ్యాస్ లీక్ ఘటనలో కార్మికులు అస్వస్థత చెందారు. తమిళనాడులో రసాయన ద్రవాల నిల్వ సక్రమంగా చేయకపోవడంతో పేలుడు సంభవించింది. ఇవన్నీ మనకు భద్రతా నియమాలు పుస్తకాలలో మాత్రమే కాదు, ప్రతిరోజు ఆచరణలో ఉండాలి అని సూచిస్తున్నాయి. ఇక్కడ ఎవరికీ నిందలు వేయాలనేది ముఖ్యమేమీ కాదుబీ అవసరం మార్పు, అవగాహన, అప్రమత్తత. ప్రతి రసాయన పరిశ్రమలో మొదటగా చేయాల్సింది ప్రమాద విశ్లేషణ. ఏ రసాయనం ఏ ఉష్ణోగ్రతలో ప్రతిచర్య చేస్తుంది, ఏ రసాయనాలు కలిస్తే ప్రమాదం, ఏ ద్రవాలు గాలిలో వేగంగా వ్యాప్తి చెందుతాయిఇలాంటి వివరాలను స్పష్టంగా గుర్తించి పరికరాల వద్ద సూచన బోర్డులు పెట్టాలి. నిల్వగదులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలి. వేడి మరియు చల్లదనం నియంత్రించే పరికరాలు పనిచేస్తున్నాయో లేదో క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. పరికరాల నిర్వహణ కూడా చాలా ముఖ్యం. యంత్రాలు, పంపులు, పైపులు, వాల్వులు కాలంతో క్షీణిస్తాయి. చిన్న చిట్లికే పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు. అందుకే నిర్వహణ షెడ్యూల్ తప్పనిసరిగా ఉండాలి. అవసరమైతే భాగాలను ముందుగానే మార్చాలి. ఖర్చు ఎక్కువైనా, రక్షణ విలువ ఎక్కువ. మరొక ముఖ్యమైన అంశం సిబ్బంది శిక్షణ. కొత్త కార్మికులు మాత్రమే కాదు, ప్రతి షిఫ్ట్‌లో పనిచేసే సిబ్బందికి కూడా నిరంతర శిక్షణ ఇవ్వాలి. గ్యాస్ లీక్ జరిగితే ఎలా స్పందించాలి, అగ్ని మంటల్లో ఏ రసాయనాలు నీటితో ఆరిపోవు, ఏవి ఆపరాదు, అత్యవసర మార్గాలు ఏవి, అలారం శబ్దం అంటే ఏమిటిఇవి అన్నీ వారికి స్పష్టంగా తెలియాలి. ప్రతి నెలా అభ్యాస విన్యాసాలు చేస్తే, భయపడకుండా, ఎలా స్పందించాలో స్పష్టత వస్తుంది. గాలి, నీరు, నేల కలుషీకరణ కూడా ప్రమాదాలే. రసాయన వ్యర్థాల పారవేయడంలో జాగ్రత్త అవసరం. ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ తనిఖీ యంత్రాలు ఏర్పాటు చేసి, గాలి నాణ్యత, నీటి వినియోగం, వ్యర్థ నియంత్రణవాటిని ప్రజలకు వెల్లడించే పారదర్శకత ఉండాలి. ఇది పరిశ్రమ%–%ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంచుతుంది. కార్మికుల ఆరోగ్య పరీక్షలు కూడా అత్యవసరం. రసాయనాల ప్రభావం ఒక్కరోజులో కనిపించదుబీ కొన్ని సందర్భాల్లో సంవత్సరాల తరువాత కూడా ప్రాణాంతక సమస్యలు బయటపడే అవకాశం ఉంది. అందుకే నియమిత ఆరోగ్య పరీక్షలు, రక్షణ దుస్తులు, మాస్కులు, గ్లౌవులు ధరించడయిఇవి తప్పనిసరి. అన్నిటికంటే ముఖ్యంగా, భద్రత ఒక సంస్కృతి కావాలి. "ఏమీ అవదు" అనే నిర్లక్ష్య భావన ప్రమాదాలకి మూలం. "జాగ్రత్తే జీవితం" అనే ఆలోచన ఆధారంగా పని వాతావరణం మారాలి. రసాయన పరిశ్రమలు అభివృద్ధి చెందాలి, ఉత్పత్తి పెరగాలిఅది మంచిది. కానీ ఆ అభివృద్ధి ప్రాణ భద్రతతో పాటు సాగాలి. భద్రతా నియమాలు చట్టం వల్ల కాదు, మనుషుల పట్ల ఉన్న ప్రేమ వల్ల పాటించాలి. మానవ జీవితం అమూల్యం. పరిశ్రమల పురోగతి ప్రాణాలను రక్షించే మార్గంలోనే కొనసాగాలి.

## సీఎం చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపిన నూజివీడు వాసులు




**నూజివీడు: నవంబర్ 7 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు పట్టణంలోని కుమార్, సిద్ధార్థ విద్యాసంస్థలు, వివిధ ప్రజా సంఘాలు నూజివీడు నియోజకవర్గమును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కుమార్ పబ్లిక్ స్కూల్ అధినేత పివి కుమార్ మరియు విద్యార్థిని, విద్యార్థులు, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత రవి, విద్యార్థిని, విద్యార్థులు ఆధ్వర్యంలో నేడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో మానవహారంగా ఏర్పడి థాంక్యూ సీఎం సార్ అంటూ సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.

## బోలెం కుటుంబానికి కైలే పరామర్శ



**తోట్లవల్లూరు, నవంబర్ 7 (వార్తా ప్రభ):** గరికపర్రు పిఏసిఎస్ మాజీ చైర్మన్, వైఎస్ఆర్సిపి నాయకుడు బోలెం శివనాగ మల్లేశ్వరరావు (చంటి) మృతి వైఎస్ఆర్సిపికి తీరని లోటని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కైలే జ్ఞానమణి అన్నారు. శివ నాగ మల్లేశ్వరరావు మృతదేహాన్ని జ్ఞానమణి శుక్రవారం సందర్శించి నివాళు లర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అన్ని విదాల అండగా ఉంటుందని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వర రెడ్డి, కుమ్మమూరు సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు నడకుదురు రాజేంద్ర, చింతలపూడి సుబ్బారావు, మర్రెడ్డి శేషిరెడ్డి, చింతలపూడి గవాస్కర్ రాజు, మైనేని తారాచంద్, ఊకోటి పరశురామయ్య, తిరుమల శెట్టి వాసు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# సమస్య మీది పరిష్కారం మాది...

-ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే కాగిత



**పెడన,నవంబర్ 7 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం లో గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజలు పార్టీ నేతల నుండి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం నాడు అర్జీలు స్వీకరించారు. పట్టణంలోని తోటమూల టీడీపీ కార్యాలయంలో ప్రజలు నాయకుల నుండి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించిన కాగిత పలు సమస్యల పై సంబంధిత అధికారులకు చర వాణి నుండి ఆదేశించి సమస్యను వెంటనే పరిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నాము. ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష, అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలే మా లక్ష్యం.ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి ప్రజల నుండి సమస్యలు పరిష్కరించ మని ప్రజల పెద్ద ఎత్తున అర్జీలు ఇస్తున్నారు. వాటిన్నిటి పరిశీలించి అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి డిసి చైర్మన్ బొర్రా కాశీ పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్యామలయ్య కూడా పాల్గొన్నారు.

## పెనుమల్లి రక్షిత మంచినీటి చెరువులో తూడు తొలగింపు



**పెడన,నవంబర్ 7 (వార్తాప్రభ) :** పెడన మండలం పెనుమల్లి గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం చెరువును ప్రక్షాళన చేసారు. జె జి ఎం వాటర్ ట్యాంకులో నాచు తూడు ఏర్పడటంతో నీరు కలుషితమవుతున్నది. ఈ నేపథ్యంలో వాటిని కూలీలతో పూర్తిగా తొలగించి పిచ్చి మొక్కలను కూడా తీసివేశారు. అలాగే పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కూడా జరిపి నట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి కరీముల్లా తెలిపారు.

## పెడన నియోజకవర్గం లో యాదవ యువజన సంఘం అధ్యక్షులు నియామకం





**పెడన,నవంబర్ 7 (వార్తాప్రభ) :** నియోజకవర్గంలో యాదవ సంఘాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సంఘం నియోజక వర్గ బాధ్యులు కొలుసు చందు యాదవ్ శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గం అధ్యక్షుని తోపాటు నాలుగు మండలాలకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ముందుగా నాలుగు మండలాలకు యాదవ సంఘ యువజన అధ్యక్షులను నియమిస్తున్నట్టు చెప్పారు. పెడన నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షునిగా జొన్నలగడ్డ ఆంజనేయులు (అంజి) నియమితులయ్యారు. బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన అంజి గత కొంతకాలంగా సంఘంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాడు. అలాగే పెడన మండలానికి సంబంధించి దండుబోయిన గణేష్ ను యువజన సంఘం అధ్యక్షునిగా నియమించారు. ఇతను కూడా గత కొంతకాలం గా సంఘంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాడు. సామాజికపరంగా యాదవులను చైతన్యపరచటమే తమ ఉద్దేశం అని వీరు తెలిపారు. పలువురు యాదవ సంఘీయులు వీరిని అభినందించారు.

## ఏపి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కి ఉమ్మడి కృష్ణ అండ్ ఎన్టీఆర్ జిల్లాల టీమ్



**మైలవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :** నవంబర్ 8,9 తేదీలలో గుంటూరు జిల్లా,సత్తెనపల్లి లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఏపి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ లో ఉమ్మడి కృష్ణ అండ్ ఎన్టీఆర్ జిల్లా టీమ్ పాల్గొనబోతు న్నట్లు స్థానిక లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.అప్పారావు శుక్రవారం తెలిపారు.గత నెల అక్టోబర్ 24న మైలవరం ఎల్.హెచ్.ఆర్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణ అండ్ ఎన్టీఆర్ జిల్లా సీని యర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు 25 అక్టోబర్ నుంచి 6 నవంబర్ వరకు కోచింగ్ క్యాం ప్ ని నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా టీమ్ ని, ఫీజికల్ డైరెక్టర్ డా.ఎన్.వి.రాజ్ కుమార్ లను కాలేజీ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.కోచింగ్ క్యాంపు నిర్వహించటానికి అవకాశం కల్పించిన యల్.బి.ఆర్.సి.ఈ మేనేజ్మెంట్ కు, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి,ఈ కార్యక్రమాన్ని నిర్వహించి న కళాశాల ఫీజికల్ డైరెక్టర్ డా.ఎన్.వి.రాజ్ కుమార్ కి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.సాంబశివ రావు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు.

# అంతర్ జిల్లాల రోలర్ హాకీ స్కేటింగ్ లో గౌతమ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ..



**గుడివాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** నవంబర్ 2 నుండి 5 వ తేదీ వరకు విశాఖపట్నం లోని స్టీల్‌ప్లాంట్ నందు జరిగిన 37వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రోలర్ హాకీ స్కేటింగ్ టోర్నమెంట్ లో గుడివాడకు చెందిన డా॥కె.కె.ఆర్ గౌతమ్ స్కూలు విద్యార్థులు ఘనమైన ప్రతిభ చాటారు. బాలికల విభాగం -క్యాడిట్ కేటగిరిలో 6వ తరగతి విద్యార్థి పి. కారుణ్య 5వ తరగతి విద్యార్థి పి.నేహ, 4వ తరగతి విద్యార్థి జె.స్నిగ్ధ లు ద్వితీయ స్థానాన్ని సాధించారు. -సబ్ జూనియర్ కేటగిరిలో 7వ తరగతి విద్యార్థి జె.జాహ్నవి తృతీయ స్థానం సాధించారు. -టైనీ టాట్స్ కేటగిరిలో 4వ తరగతి విద్యార్థి వి.చేతన కృష్ణ, 3వ తరగతి విద్యార్థి బి.ప్రవర్షిణి రామరాజ్, 2వ తరగతి విద్యార్థిని కె.పరిణిత లు ద్వితీయ స్థానాన్ని సాధించారు. గెలుపొందిన విద్యార్థులను మరియు కోచ్ పి.ఎస్.వి.ఎస్ అయ్యప్ప లను పాఠశాల ఆవరణలో జరిగిన సభలో ప్రిన్సిపల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతీ లు అభినందించారు.

## వందే భారత్ ట్రైన్ పొడిగింపు.. హర్షం వ్యక్తం చేసిన అర్జున్ యర్రపోతు

**గుడివాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** వందే భారత్ ట్రైన్ చెన్నై నుంచి గుడివాడ మీదుగా నరసాపురం వెళ్లే విధంగా పొడిగించినందుకు ప్రయాణికుల తరపున, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తరపున, మరియు కూటమి ప్రభుత్వం తరపున రైల్వే డెవలప్మెంట్ బోర్డ్ మెంబర్స్ తరపున, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, మరియు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ కి, రైల్వే అధికారులు, మరియు ఉద్యోగస్తులకు, వందే భారత్ రైలు చెన్నై నుంచి గుడివాడ మీదుగా నరసాపూర్ వేసినందుకు భారతీయ జనతా పార్టీ మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్, రైల్వే డెవలప్మెంట్ బోర్డు మెంబర్ అర్జున్ యర్రపోతు కృతజ్ఞతలు తెలియజేసారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు వల్లభనేని వంశీ



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 7 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలంలోని బాపులపాడు గ్రామంలో గూడవల్లి చిన్న ఇంట్లో ఇటీవల వివాహం జరుగగా ఆ కుటుంబాన్ని కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బాపులపాడు గ్రామానికి చెందిన గంధం నారాయణ సతీమణి ఇటీవల మరణించగా నేడు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వైస్సార్సీపీ కొత్తూరు సాగర్ అనారోగ్యంతో బాధపతుండగా అయన ఇంటికి వెళ్లి క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని,సాగర్ కి అయన కుటుంబ సభ్యులకు అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు. అనంతరం బాపులపాడు మండలం ఎంపీపీ నగేష్ మాతృమూర్తి ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి నగేష్ కుటుంబసభ్యులను పరామర్శించిన గన్నవరం మాజీ శాసనసభ్యులు డా. వల్లభనేని వంశీ.

# గుడివాడలో నేషనల్ లీగల్ సర్వీసెస్ డే వేడుకలు

● విద్యార్థినీ విద్యార్థులకు పోటీ పరీక్షలు.. విజేతలకు బహుమతులు.. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన..



**గుడివాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** శుక్రవారం మండల న్యాయ సేవాధికార కమిటీ వారీ ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ (నల్సా) డే ను స్థానిక కోర్టు కాంపౌండ్ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ ఎస్ సుబ్రహ్మణ్యం గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పేదలకు.. అర్హులైన అందరికీ ఉచిత సహాయం అందాలనే ఉద్దేశ్యం తో ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. అలాగే షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగలు వరద బాధితులు భూకంప బాధితులు పకృతి వైపరీత్యాల వలన సంభవించే ఉన్న బాధితులకు ఎవరైనా కేసులు ఉన్న వారందరికీ ప్రతి ఒక్కరికి ఉచిత సహాయం అందించడమే లీగల్ సర్వీసెస్ అథారిటీ యొక్క ధ్యేయమని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా సేవ్ ది గర్ల్ చైల్డ్ మీద అన్ని పాఠశాలలో కాంపిటీషన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోటీలలో గెలుంపొందిన విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శ్రీ వాసుదేవ్ గారు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి గాయత్రి గారు, అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి డి అరుంధతి గారు మరియు బార్ అసోసియే షన్ అధ్యక్షుడు తుమ్మలచర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి జాగృతి క్లబ్ గుడివాడ వారిచే '5'వ జత నేత్రాల సేకరణ..



**గుడివాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** స్థానిక సత్యనారాయణపురంలో చంటి అపార్ట్మెంట్స్ లో నివసిస్తున్న బొగ్గరపు అమృతవల్లి 58 సంవత్సరాలు గుండెపోటుతో మృతిచెందిగా.. చక్క రామ్ సుధీర్ వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం యొక్క విశిష్టతను తెలియజేసి నేత్రదాన ప్రోత్సాహకులు గాదె మోహన్ బాబుకు తెలియజేయగా వారు ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్ మహేష్ ద్వారా కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకటప్రసాద్, కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు తదితరులు పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## 10న పి.ఎం. నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా !

**గుడివాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా ఈనెల 10వ తేదీన కే. బి. ఆర్ గవర్నమెంట్ ఐటిఐ గుడివా డ నందు ఉదయం 10 గంటలకు జరుగును. ప్రముఖ కంపెనీల ప్రతి నిధులు హాజరై అభ్యర్థులను అప్రెంటిస్ గా చేర్చుకోవడం జరుగుతు ంది. కావున ఐటిఐ పాస్ అయ్యి అప్రెంటిస్ పూర్తికాని అభ్యర్థులు అన్ని ట్రేడులవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావలసి ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరుచున్నాము. అభ్యర్థులు ఈ క్రింది లింకు ద్వారా www.aprenticeshipindia. gov.in/mela-registration రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని ప్రిన్సిపల్ / కన్వీనర్ ఓ. మంజులాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలను నివృత్తి కోసం 08674-295953 నెంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# క్రీడలు ద్వారా మరింత ఆత్మవిశ్వాసం పెంచుకోవచ్చు...

● 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా ఎస్.జి.ఎఫ్. స్క్వాష్ ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ నారాయణ రావు...





**కాకినాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** 69వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల ఎస్.జి.ఎఫ్. స్క్వాష్ ఛాంపియన్షిప్ 2025- 26 లో భాగంగా అండర్ 14, 17, 19 బాల -బాలికల విభాగపు పోటీలు స్థానిక డిఎస్ఏ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నారాయణరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఛాంపియన్షిప్‌కు శుభారంభం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ స్క్వాష్ అనేది కేవలం క్రీడ మాత్రమే కాదు.. శరీరం మనసును సమానంగా శక్తివంతం చేసే ఆరోగ్యకరమైన కసరత్తు అని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన ఇండోర్ గేమ్ గుండె ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుందని, శక్తి సమన్వయాన్ని పెంపొంది స్తుందని తెలిపారు, వేగవంతమైన స్పందన సామర్థ్యాలను మెరుగుపరుస్తుందని కూడా వెల్లడించారు. స్క్వాష్ క్రీడ యువతలో దృష్టిని పదునుపెట్టి, ఒత్తిడిని తగ్గిస్తూ వ్యూహాత్మక ఆలోచనలను అభివృద్ధి చేసే ప్రత్యేకత కూడా ఈ ఆటలో ఉందన్నారు. కొత్త స్నేహాలు, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి స్క్వాష్ అందించే ప్రధాన విలువలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్ట్రక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మెహబూబ్ భాష, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ సుధారాణి, కే.శ్రీనివాస్, హాకీ కోచ్ రవిరాజ్‌తో పాటు వివిధ జిల్లాల పీడీలు పాల్గొన్నారు.

## నూజివీడు స్నేహ రైడ్స్ లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**నూజివీడు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏలూరు వారి ఆధ్వర్యంలో జాతీయ దత్తత అవగాహన మాసం నవంబర్ 25 కార్యక్రమంలో భాగంగా నూజివీడు స్నేహ రెడ్స్ లో జాతీయ దత్తత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు జిల్లా బాలల సంరక్షణ అధికారి మరియు బాలల సంక్షేమ సమితి సభ్యులు హాజరయ్యారు. ఓపెన్ షెల్టర్ లో ఆశ్రయం పొందుతున్న బాల, బాలికలతో సంభాషించడం జరిగింది. అనంతరం బాల,బాలికలకు అందుతున్న సేవలు తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి మాట్లాడుతూ బాలల హక్కుల దినోత్సవం మరియు జాతీయ దత్తత అవగాహన మాసమును 01-11-2025 నుండి 30-11-2025 బాలల సంక్షేమ సమితి నుండి ఆశ్రయం నిమిత్తం పంపబడి హాస్టల్ నందు వసతి పొందుతున్న హాస్టల్స్ ను విజిట్ చేసి వారిలో బాలలకు ఎవరికైతే తల్లిదండ్రులు లేరు మరియు ఎవరు పట్టించుకోరు అటువంటి బాల, బాలికలు ఎవరైనా ఉన్నట్లయితే ఆ బాలలను దత్తత ప్రక్రియలోకి తీసుకొని వచ్చి వారికి తల్లిదండ్రుల ప్రేమను అందించేలాగా చేయించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా బాలల సంరక్షణ కి మరియు హక్కుల పరిరక్షణకు జిల్లాస్థాయిలో బాలల సంరక్షణ కార్యాలయాలు పనిచేస్తున్నట్లు చెప్పారు. బాలల సంక్షేమ సమితి సభ్యురాలు కె హైమావతి మాట్లాడుతూ బాలల సంక్షేమ సమితి తరపున ఆదరణ మరియు సంరక్షణ అవసరం ఉన్న బాలలకు సంరక్షణ మరియు విద్యను అందించడం కోసం జిల్లా స్థాయిలో బాలల సంక్షేమ సమితి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ కార్యాలయం యొక్క ఇన్స్టిట్యూషనల్ కేర్ అధికారి సిహెచ్ శ్రీకాంత్ మరియు చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ వై వి రాజు, హోం సిబ్బంది ఇందు, సత్య, హోమ్ లోని బాలబాలికలు పాల్గొన్నారు.

# విశ్రాంతి ఉత్తమ ఉపాధ్యాయురాలు ఖానాభి మృతి



**పెనుగంచిప్రోలు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు కు చెంది ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన విశ్రాంతి ఉపాధ్యాయు రాలు ఖానాభీ (70) శుక్రవారం అనారోగ్యం తో విజయవాడ లోనీ ఒక ప్రవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందారు. పలు వురు ఉపాధ్యాయులు ఆమె మృతి పట్ల సంతాపం తెలియజేసారు. ఖానాభి ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుల్లో ఆమె ఒకరన్నారు. దీర్ఘకాలంగా పెనుగంచిప్రోలు లోనే ఉపాధ్యాయురాలుగా పని చేసారన్నారు. వృత్తి పట్ల అంకిత బావంతో పనిచేసేవారన్నారు.వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు నివాళులర్పించారు.

## శ్రీ తిరుపతమ్మ సన్నిధిలో నూతన రూరల్ డీసీపీ లక్ష్మి నారాయణ..





**పెనుగంచిప్రోలు, నవంబర్ 7 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సన్నిధిలోఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ శుక్రవారం శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి ఆలయ అధికారులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు, మర్రే బోయిన గోపి బాబు, అర్చకులు, ఆలయ అధికారులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో జరగబోవు రంగుల మహోత్సవం కార్యక్రమం గురించి వివరించారు.అందరీ సహకారంతో శాంతియుతంగా సాంప్రదాయ బద్దంగా రంగుల మహోత్సవం కార్యక్రమం అన్ని డిపార్ట్మెంట్ల కోఆర్డినేషన్ తో ఘనంగా నిర్వహించుటకు ముందుగానే తగిన ఏర్పాట్లు చేద్దామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్, పెనుగంచిప్రోలు ట్రైనీ ఎస్ఐ గిరి సాయి, ఆలయ ఈఈ రమాదేవి, ఆలయ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లాప్రోస్కోప్ ద్వారా ఆపరేషన్



**తిరువూరు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** తిరువూరు జయ కృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన వైద్యులచే అరుదైన శాస్త్ర చికిత్స మహిళ గర్భంలో నుండి గర్భసంచి తొలగింపు డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మా హాస్పిటల్ నందు సుదీర్ఘ అనుభవం కలిగిన వైద్య నిపుణులచే అధునాతనమైన పరికరాలు చే లాప్రోస్కోప్ ద్వారా అతి తక్కువ ఖర్చుతో ఆపరేషన్ నిర్వహించబడును 24 గంటలు మా హాస్పటల్ నందు వైద్య సేవలు అందించబడును షుగరు బిపి థైరాయిడ్ గుండెకు సంబంధించిన వ్యాధులు ప్రత్యేకంగా చూడబడును

## విజయవంతమైన మెగా జాబ్ మేళా కార్యక్రమం



**గుడివాడ,నవంబర్ 7 (వార్తాప్రభ) :** స్థానిక కేటీఆర్ మహిళా కళాశా లలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవా రం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం జయప్రదంగా జరిగిం ది. జాబ్ మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని నిర్వహించిన ఇంటర్వ్యూలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. ముందుగా కేటీఆర్ కళాశాల చైర్మన్ పర్వతనేని నిర్మల జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభి ంచారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు అందించాలనే సంకల్పంతో మెగా జాబ్ మేళాలు నిర్వహించడం అభినందనీయమని చైర్మన్ నిర్మల అన్నారు. జాబ్ మేళాను యువతరం సద్వినియోగం చేసుకోవాలని అధికార ప్రముఖులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుష్మ, డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విక్టర్ బాబు, డిస్టిక్ ప్లేస్మెంట్ ఆఫీసర్ మధు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**గన్నవరం మండలంలోని దావాజీగూడెం గ్రామానికి చెందిన కోట శామ్యూల్ ఇటీవల మరణించగా నేడు జరిగిన కార్యక్రమంలో శామ్యూల్ ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన గన్నవరం మాజీ శాసనసభ్యులు డా. వల్లభనేని వంశీ**

-గన్నవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :

# మైలవరంలో ప్రజాదర్బారుకు వినతులు వెల్లువ

● ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

● 4 గంటలకు పైగా నిర్విరామంగా కొనసాగిన వినతుల స్వీకరణ.





**మైలవరం,నవంబర్ 7 (వార్తాప్రభ) :** ప్రజాసమస్యల పరిష్కార వేదికగా నిర్వహించిన 'ప్రజాదర్బారు'కు వినతులు వెల్లువెత్తాయి.మైలవరం పట్టణంలోని శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బారులో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ప్రజల సమస్యలను ఓపికగా విని వారి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజాదర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు అందుబాటు లో ఉంటారనీ, ఇక్కడకు వచ్చే సమస్యలను నెల రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల న్నారు.ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ బాధ్యతతో పని చేయాలన్నారు. సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బారులో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్తు, రహదారుల అభివృద్ధి, వివిధ శాఖలకు సంభందించిన సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. వాటిలో సమస్య తీవ్రతను బట్టి వెంటనే పరిష్కరించే అవకాశం ఉన్నవాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిధుల మంజూరుతో ముడిపడిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. మరికొన్ని సమస్యలపై సమగ్రంగా విచారించి తగు చర్యలు చేపట్టాలని అధికారుల ను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ఇళ్లస్థలాల మంజూరు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. అనురాధ, తహశీల్దార్ అబ్దుల్ దరియా, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ),స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం జాతీయ గీతాన్ని ఆలపించిన బి.బి.ఏ.నేతలు, అడ్వకేట్లు





**విజయవాడ లీగల్,నవంబర్ 7 (వార్తాప్రభ) :** భారత జాతీయ గీతం వందేమాతరం 150 వ వార్షికోత్సవ సందర్భంగా మన దేశ ప్రధాని మోడీ పిలుపుమేరకు ది బెజవాడ బార్ అసోసియేషన్ లో బి బి ఏ ప్రెసిడెంట్ ఎ కె బాష మరియు గవర్నింగ్ బాడీ ఆధ్వర్యంలో న్యాయ వాదులందరూ కలసి మన జాతీయ గీతం వందేమాతరాన్ని ఆలపించి మన జాతీయ గీతం మన దేశం మీద ఉన్న గౌరవాన్ని తెలియజేశారు.

**కర్నాటి రామ్మోహన్ రావు కు ఘన నివాళులర్పించిన బి బి ఏ**

ప్రముఖ న్యాయవాది కర్నాటి రామ్మోహన్ రావు నాలుగవ వర్ధంతి సందర్భంగా బెజవాడ అధ్యక్షులు ఎ కె బాష కర్నాటి రామ్మోహన్ రావు కి ది బెజవాడ భారత్ అసోసియేషన్ లో ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా కర్నాటి రామ్మోహన్ రావు స్మారకార్థం బార్ కౌన్సిల్ మెంబర్స్ చలసాని అజయ్ కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్ మరియు సురాబత్తుల మల్లేశ్వర రావు తపాలా స్టాంపులను ఆవిష్కరించారు మరియు ప్రముఖ న్యాయవాది గౌతమి రెడ్డి మరియు చుక్కపల్లి భాను ప్రసాద్ మరియు ఆయన శిష్యులం దరూ కలిసి ఆయనకు గుర్తుగా ఆయన లోగో తో పోస్టల్కవర్ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా కర్నాటి రామ్మోహన్ రావు గారి శిష్యులు మరియు బెజవాడ బార్ ప్రెసిడెంట్ అయిన ఎ కె బాష మాట్లాడుతూ కర్నాటి రామ్మోహన్ రావు గారు ఎన్నో ఉద్యమాలు చేశారని ఎవరికీ భయపడేవారు కాదని ఆయన పోరాటాలతో బెజవాడ బార్ ఖ్యాతిని దేశమంతా వ్యాపించేలా చేశారని ఆయన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కర్నాటి రామ్మోహన్ రావు ఆదర్శభావాలతో ఉండే వారిని జడ్జిలు కూడా ఆయనకి ఎంతో గౌరవం ఇచ్చే వారిని దేశవ్యాప్తంగా ఆయనకి గొప్ప పేరు ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా కర్నాటి రామ్మోహన్ రావు శిష్యులు అందరూ ఆయనను తలుచుకుంటూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని సానిహిత్యాన్ని మరొకసారి గుర్తు చేసుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# నేటికీ దేశభక్తి భావన నింపుతున్న వందేమాతరం..

-ఎస్ఎస్పిఎం బాలికోన్నత పాఠశాలలో వందేమాతర వేడుకలు......

**పెనుగంచిప్రోలు, నవంబర్ 7 (వార్తాప్రభ) :** స్వాతంత్ర పోరాటంలో కులమతాలకు అతీతంగా స్పూర్తిని నింపి తెల్లవారిపై పోరాట సూచకగా నిలిచిన వందేమాతరం గేయం నూట యాభై సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషదాయకమని గ్రామ పెద్దలు మహమ్మద్ అజాద్, ఇన్ ఛార్జ్ హెచ్ ఎం ముక్కా సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నాడు పెనుగంచిప్రోలు స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికోన్నత పాఠశాలలో వందేమాతర గేయ ఉత్సవాలు వ్యాయామ ఉపాధ్యాయులు వేగినేటి వెంకటరమణ నిర్వహణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బకించంద్ర చటర్జీ రాసిన ఆనందమఠం నవల నుండి వందేమాతరం గేయాన్ని జాతీయ గేయంగా తీసుకున్నారని వివరించారు. ఈనాటికి వందేమాతరం అనే పదాలు వినగానే దేశభక్తి ఉప్పొంగుతుందని, మాతృభూమిని గౌరవించే గేయంగా భారతీయ చరిత్రలో వందేమాతరం స్థానం పొందిందని సత్య నారాయణ తెలిపారు. ఒకే రోజు ఒకే సమయంలో దేశవ్యాప్తంగా



వందేమాతరం గేయాలాపన ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవరావు, గంటా వెంకటేశ్వరరావు, నల్లూరి పద్మ, పాకలపాటి ఉష, వాణి, ప్రమీల, స్వాతి శిల్ప , భారతి, స్వర్ణలత, శ్రీదేవి మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# వందేమాతరం గేయం స్ఫూర్తి ప్రజల్లో పరిఢవిల్లాలి-ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

-మైలవరంలో 150 ఏళ్ల 'వందేమాతరం' సంస్మరణోత్సవం



**నమైలవరంనవంబర్ 7 (వార్తాప్రభ) :** వందేమాతరం గేయం స్ఫూర్తి ప్రజల్లో పరిఢవిల్లాలని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండిన సందర్భంగా మైలవరం పట్టణంలోని శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం బంకిమ్ చంద్రచట్టో పాధ్యాయులు చిత్రపటానికి ఎమ్మెల్యే వసంత పూలమాలలు చేసి ఘనంగా నివాళులర్పించా రు.ఈ సందర్భంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.అనంతరంఎమ్మెల్యే మాట్లాడుతూ వందేమాతరం, స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణనిచ్చిన ఓ అగ్నిగీతమని, ఈ జాతీయ గీతం దేశ భక్తిని, ఏకత్వాన్ని, త్యాగస్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు.అనతికాలంలోనే ఈ గేయం దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచింద న్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ దరియా, ఎంపీడీవో పి.అనురాధ, అక్కల గాంధీ, లంక లితీష్, చారు గుండ్ల ప్రసాద్, ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి 10,000 ఆర్థిక సాయం



**కోడూరు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని పిట్టలంక గ్రామంలో ఇటీవల కైలా శరత్ కు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలి పోయింది. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పిట్టలంక గ్రామ జనసేన పార్టీ నాయకులు పరామర్శించి 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బియ్యాన్ని అందజేశారు. మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, పిట్టలంక సర్పంచ్ కనకాల వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ బావి శెట్టి ప్రభాకర్ రావు, శ్రీ వీరాంజనేయ రియల్ ఎస్టేట్ సంస్థ అధినేత బడే వీర వెంకటరావు, గ్రామ పార్టీ కన్వీనర్ కంచర్లపల్లి వెంకటరమణ, కడవకొల్లు రాజేష్, పేర్ని మణికంత, పేర్ని ప్రసన్న కొడాలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విస్సన్నపేట జడ్ పి టి సి రిజర్వేషన్ ఎస్సీ మహిళ?

**విస్సన్నపేట,నవంబర్ 7 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో 40 వేలకు పైగా ఓటర్లు ఉన్న జడ్పిటిసి స్థానం ఎస్సీ మహిళ రిజర్వేషన్ ఏర్పడే అవకాశం ఉన్నట్లు సర్వత్ర ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సామాజిక వర్గ జిల్లా స్థాయి నాయకుడు సామాజిక వర్గాల వారీగా గ్రామాలలో లీడర్ల చేతుల మీదుగా సన్న బియ్యం టిక్కీలు పేద కుటుంబాలకు పంపిణీ చేయడం కోసమెరుపుగా చెప్పుకోవచ్చు. గతంలో మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి స్థానాలు వైసిపి ఖాతాలో ఉండగా తిరిగి అదే చరిష్మాతో జడ్పిటిసి స్థానాన్ని మండలాధ్యక్ష పీఠం తో పాటు తిరిగి సాధించే లక్ష్యంగా చాప కింద నీరుల పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ముదిరాజ్, కాపు, ముస్లిం మైనారిటీ,ఆర్యవైశ్య వింగ్ ల లీడర్ల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించడమే కాకుండా సమస్య ఏదైనా తనకి చెప్పాలని సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు పథక రచన చేస్తానని భరోసా ఇచ్చినట్లు పలువురు అనుకుంటున్నారు. అధికార టీడీపీ పార్టీకి సంబంధించి పార్టీ అధిష్టానం ఆదేశిస్తే గతంలో ఎంపీటీసీగా గెలిచి సేవలు అందించిన రాజకీయ పరిపక్వత పదిమందిలో మంచితనం అందరికీ సుపరిచితుడు అజాతశత్రువు వంటి మంచి మనసున్న కుటుంబం నుండి పోల్ మేనేజ్మెంట్ లో అపార అనుభవం కలిగిన రాజకీయ చాణుక్యల సలహా సంప్రదింపులతో బిజెపి జనసేన తెలుగుదేశం పార్టీల కూటమి పెద్దల ఆశీస్సులతో జడ్పిటిసి ఎన్నికల బరి కథనరంగంలో దూకేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలుచోట్ల వినిపిస్తుంది.

# ఘనంగా వందేమాతరం గీతాన్ని ఆలపించిన విద్యార్థులు : దారపురెడ్డి భాస్కరరావు




**హనుమాన్ జంక్షన్,నవంబర్ 7 (వార్తాప్రభ) :** మద్దాయి-కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం వందేమాతరం గీతాలాపన 150 సంవత్సరాల కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కర రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ పూర్తి వందేమాతరం గీతాన్ని జాతీయ జెండాల చేత భూని, మహనీయుల చిత్రపటాలు చేత పట్టుకుని ఆలపించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ జాతీయ గీతం వందేమాతరం అని ఈ గీతాన్ని బెంగాల్ రచయిత బంకించంద్ర చటర్జీ 1875 నవంబర్ 7న మొదట సంస్కృతం, బంగ్లా భాషలో రచించారు. ఇది 1882లో పబ్లిష్ చేయబడిన ఆయన రాసిన ఆనంద నవలలో భాగమని, వందేమాతరం అంటే ఓ తల్లి నీకు నమస్కారాలు అని అర్థం, మాతృ భూమిని పూజించే భావనను ప్రతిమిస్తుంది అని తెలిపారు. భారత స్వతంత్ర పోరాటంలో ఈ గీత రణ నినాదం గా మారి, ప్రజలలో దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించి లక్షలాది భారతీయులు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనేటట్లు చేసింది. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతానికి సంగీతం సమకూర్చి 1896 కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొదటిగా ఆలపించారు. 1950 జనవరి 24న భారత రాజ్యాంగ సభ ఈ గీత లోని మొదటి రెండు పద్యాలను అధికారిక జాతీయ గేయంగా స్వీకరించింది.మన దేశంలో వివిధ భాషలు సంస్కృతులు ప్రజలందరినీ ఐక్యం చేసే జాతీయ ఐక్యతక జనగణమన జాతీయ గీతంతో సమానమైన హోదాని వందేమాతరంకు లభించిందని అన్నారు. విద్యార్థులందరూ దేశభక్తి పెంపొందించు కోవాలన్నారు. మహనీయులు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎర్రబాల శివరామకృష్ణ కే నవ్య, పి నాగేంద్రరావు, జే పద్మ పి యువరాజు, అనురాధ, జ్యోతి, జయప్రద, పి డేనియల్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ పరీక్షలతోనే సాధ్యం..

● క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరం.. ● వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వీర పాండ్యన్




**విజయవాడ,నవంబర్ 7(వార్తాప్రభ) :** క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని క్రమం తప్పక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం వ్యాధి నియంత్రణకు దోహదపడుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుంటుంబ శాఖ కమీషనర్ వీర పాండ్యన్ అన్నారు. జతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యాక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వీర పాండ్యన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహనపై రూపొందిన గోడ పత్రికలను విడుదల చేసిన అనంతరం వీర పాండ్యన్ మాట్లాడుతూ ఆధునీక సమాజంలో పెరుగుతున్న జీవన ప్రమాణాలతో పాటు జీవన శైలిలో మార్పుల వలన అసంక్రమిత వ్యాధుల నమోదు సంఖ్య నానాటికి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఏడాది క్యాన్సర్ కేసులు గుర్తింపబడుతున్నాయన్నారు. ప్రజలు క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన లేమితో వ్యాధి తీవ్రత పెరిగే వరకు గుర్తించకపోవడం వలన వ్యాధి నియంత్రణ చేయలేని పరిస్థితికి చేరుకుంటున్నారన్నారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారికి రెడియో కీమో చికిత్సలు చేయవలసి రావడం వలన వ్యాధిగ్రస్తులతో పాటు వారి కుంటుంబాలు ఆర్థిక మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుని తొలి దశలోనే వ్యాధిని గుర్తించగలిగితే చికిత్స ద్వారా వ్యాధిని నియంత్రించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధి చికిత్సలను ఉచితంగా అందించడం జరుగుతుందని ప్రజలు ముందుకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకునేలా చైతన్యవంతులుగా చేయవలసిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు తో పాటు ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నుండి రక్షణ పొందేలా ప్రజలలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని వైద్య అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి బారిన పడిన రోగుల సంఖ్య నానాటికి పెరుగుతున్న తరుణంలో ప్రజలలో అవగాహన కల్పించడమే ప్రధానమన్నారు. గతంలో 50 నుండి 60 సంవత్సరాలు పైబడిన వారిలో క్యాన్సర్ లక్షణాలు బయటపడేవన్నారు. విపరీతమైన మానసిక శారీరక ఒత్తిడిలతో పాటు అహారపు అలవాట్లు క్యాన్సర్ వ్యాధికి కారణమవుతున్నాయన్నారు. అనారోగ్యానికి కారణమైన జంక్ ఫుడ్స్ చక్కెర, ఉప్పు కొవ్వు పదార్థాలు అధిక క్యాలరీస్ వివిధ హార్మోన్లపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి కారణమైయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రతి రోజు వాకింగ్, రన్నింగ్, సైకిలింగ్, యోగా వంటి వ్యాయామాలను ఆచరించిన్నట్లయితే క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాల పట్ల ప్రజలలో అవగాహన కల్పించిన్నట్లయితే తొలి దశలోనే వ్యాధిని గుర్తించి నివారించేందుకు చర్యలు తీసుకోవాచ్చునన్నారు. క్యాన్సర్ వ్యాధి గతంలో రేడియేషన్ ట్రీట్ మెంట్ అందించవలసి వచ్చేదని ప్రస్తుతం మందుల ద్వారా వ్యాధిని నివారించే అవకాశాలు ఉన్నాయన్నారు. పొగాకు ఉత్పత్తులు మద్యం సేవించడం వంటి దురాలవాట్ల వలన ఊపిరితిత్తులు రొమ్ము, నోరు, ఉదరకోశం, కాలేయం, గర్భాశయ ముఖదారంలో క్యాన్సర్ వ్యాధి ఏర్పాడుతుందన్నారు.. సంబంధిత అవయవాలలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైన తక్షణమే పరిక్షలు నిర్వహించుకుని వ్యాధి నిర్ధరణ చేసుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. శ్యామల, డబ్ల్యుహెచ్వి కన్సల్టెంట్ డా. జి. సురేష్, డియంహెచ్వి డా. యం సుహాసిని, ఎన్సిడి నోడల్ అధికారి డా. మాధవి, డిపిఎంవో డా. పి. నవీన్, వైద్యాధికారులు డా. స్నేహ సమీరా, డా. హాఫీసా, తదితరులు పాల్గొన్నారు.

# కోడూరులో నూతన ఏఎంసీ చెక్ పోస్ట్ ప్రారంభం

-ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు



**కోడూరు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** కోడూరులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి నూతన తనిఖీ కేంద్రం - చెక్ పోస్ట్ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిధులుగా నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు విచ్చేసి చెక్ పోస్ట్ ప్రారంభించారు. దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డైరెక్టర్లు అతిధులను ఘనంగా సత్కరించారు. అనంతరం వందేమాతర గీతం రచించి 150 ఏళ్లు పూర్తి అయిన మహోన్నత ఘట్టాన్ని పురస్కరించుకొని నాయకులు, అధికారులు కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, స్వచ్ఛ ఏపీ మిషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పిట్టల్లంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ లంకె భాస్కరరావు, పీఏసీఎస్ చైర్మన్లు కోట సుబ్బారావు, పూతబోయిన కరుణ కుమార్, బొలిశెట్టి విఠల్ రావు, బళ్ళ సీతారామ ప్రసాద్, టీసీ అధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్, ఏఎంసీ డైరెక్టర్లు జరుగు ఆదినారాయణ, పిరాటి శిరీష, కారాని సరస్వతి, మంగళగిరి శ్రీనివాసరావు, మాతంగి వెంకటేశ్వరమ్మ, పిల్లి మల్లేశ్వరి, పుప్పాల ఏసు, షేక్ పర్వీన్, కూటమి నాయకులు సిద్దినేని అశోక్ నాయుడు, కర్రా సుధాకర్, ముద్దినేని చంద్రరావు, అద్దంకి పాండురంగారావు, పూతబోయిన రత్నకుమార్, కాగిత రామారావు, పిరాటి బలరాం, రెడ్రౌతు కృష్ణబాబు, యర్రంశెట్టి దామోదర్, పిల్లి మల్లి, గోగినేని సోమశేఖర్, దావు మల్లి, బండే వెంకటేశ్వరరావు, కాగిత శివప్రసాద్, మేడికొండ విజయ్, సనకా జగన్, కడవకొల్లు రంగా, బచ్చు వెంకటేష్, అప్పికట్ల వినోద్, పూతబోయిన శ్రీనివాస్, తాతా పోతురాజు, బచ్చు పూర్ణచంద్రరావు, కారంకి మనోహర్, కడవకొల్లు శ్రీనివాసరావు, కోట రత్నారావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, పెద్ది బాబూరావు, ఏఎంసీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, యూడీసీ బడే గంగాధరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వందేమాతర గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నూజివీడులో ర్యాలీ




**నూజివీడు,నవంబర్ 7 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలోని సెవెంత్-డే అడ్వెంటిస్ట్ స్కూల్ ప్రిన్సిపల్ మనోజ్ కుమార్ పులిపాక అధ్యక్షతన ఎస్ డి ఏ విద్యార్థులు వందేమాతరం అంటూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్ డి ఏ విద్యా సంస్థ నుండి శ్రీనివాస మహల్ సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఎస్ డి ఏ విద్యాసంస్థల ప్రిన్సిపల్ మనోజ్ కుమార్ పులిపాక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం వందేమాతరం వేడుక ఏడాది కొనసాగించేందుకు ఐక్యంగా ముందడుగు వేయాలన్నారు. వందేమాతర గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా భారతీయులుగా ఈ వేడుక చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. వందేమాతరంతో ఆనాడు స్వాతంత్ర ఉద్యమానికి కొత్త ఊపిరి ఊదినట్లు తెలిపారు. ఉద్యమ జ్వాల రగిలిం చిన వందేమాతరం భారతీయుల నరనరాన జీర్ణించుకుని ఉన్నద న్నారు. ఈ కార్యక్రమములో స్కూల్ హెడ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్ లింగాల, ఉపాధ్యాయులు యరకయ్య, రాజా, శివాంజనేయులు, మేరీ, సిసిలీ, మంజుల, పద్మ, విజయ్, రత్న ప్రసాద్, సీనియర్ సిబ్బంది, అమెరికన్ హాస్పిటల్ పీ ఆర్ ఓ జాషువ దేవరపల్లి పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188